సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 16.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 346
పేజీలు: 08 వెల: రూ. 5

కరువు కోరల్లో 320 మండలాలు

తెలంగాణపై 'ఎల్‌నినో' ప్రభావం

117 మండలాల్లో తీవ్రం.. ప్రభుత్వం అప్రమత్తం

11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం

కరువు నివారణకు భట్టి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ

పంట నష్టానికి ఎకరాకు రూ.10 వేల పరిహారం ప్రతిపాదన



ముద్ర, హైదరాబాద్:
రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, కరువు ముప్పు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఎం శనివారం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. అందులోనూ 117 మండలాల్లో తీవ్రమైన కరువు తాండవిస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు రామకృష్ణారావు ఎల్‌నినో తీవ్రత, దాని వల్ల కలిగే ప్రభావాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన 'కేబినెట్ సబ్ కమిటీ'..

కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు గాను డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్ష తన కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సబ్ కమిటీ కరువు పరిస్థితులను అధిగమించేందుకు, తాగునీరు, సాగునీరు, పంట నష్టాల నివారణకు సమగ్రమైన 'రోడ్ మ్యాప్' సిద్ధం చేయనుంది. కేబినెట్ సబ్ కమిటీ తన తొలీ సమావేశాన్ని రేపు (శుక్రవారం) నిర్వహించనుంది.

మరోవైపు ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం తేల్చింది. ఈ నష్టానికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఇందుకోసం రూ.1,118 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రం కానుందని వాతావరణ శాఖ అంచనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు, పంటనష్టం, తాగునీరు, సాగునీటి లభ్యతపై ప్రభుత్వ యంత్రాంగం సమగ్ర నివేదిక రూపొందించింది. ఈ నివేదికను ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారులు సమర్పించారు.

సస్పెన్షన్ వేటు

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఈ విధుల నుంచి తొలగింపు



- యాదాద్రి ప్లాంట్‌లో ఉత్పత్తి అంతరాయాలపై సీఎం సీరియస్
- ఇన్‌ఛార్జులుగా ఐదుగురు ఐఏఎస్‌ల నియామకం
- బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక అధికారుల నిఘా
- నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లనూ సస్పెండ్ చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

ముద్ర, హైదరాబాద్:
యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిలో జరుగుతున్న అంతరాయంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ (చీఫ్ ఇంజినీర్) సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పర్యవేక్షణ కోసం ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

మరోవైపు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు థర్మల్ కేంద్రానికి ప్రభుత్వం ఏఐఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. హరికిషన్, వెంకటేశ్ దొత్రే, రాహుల్‌రాజ్, హనుమంత్ కొండిబ, శివకుమార్ నాయుడుని స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించనున్నారు. విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐఏఎస్‌లనూ సస్పెండ్ చేస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

విద్యుత్ అంతరాయాలపై సీఎం ఆగ్రహం బుధవారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగే విధంగా చూడాలని ఎన్నిసార్లు మిగతా 02లో

న్యాయవ్యవస్థను బెదిరించలేరు

సుప్రీంకోర్టుకు రాహుల్ ర్యాలీపై సీజేఐ ఘాటు వ్యాఖ్యలు

- రాజకీయ నిరసనలతో కోర్టుపై ఒత్తిడి తేవొద్దు
- రాహుల్ సహా పలువురికి సుప్రీంకోర్టు నోటీసులు
- రాహుల్ గాంధీ మార్చిపై సుప్రీం సీరియస్.. సీసీటీవీ రికార్డులు భద్రపరచాలని ఆదేశం
- నోటీసులిచ్చినంత మాత్రాన సమర్థించినట్లు కాదు
- ఇండియా కూటమికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఎస్ఐఆర్‌పై పోరుకు సుప్రీంకోర్టు వేదికగా నిరసన
- రాహుల్ గాంధీ తీరుపై తదుపరి విచారణలో ఆరా



ముద్ర, న్యూఢిల్లీ :
ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేయడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు చేపట్టిన పాదయాత్ర, నిరసన ప్రదర్శనలపై గురువారం అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసింది. రాహుల్ ర్యాలీపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ స్పందిస్తూ.. 'న్యాయ వ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు' అని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై నిర్ణయాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ, ఇతర 'ఇండియా' కూటమి నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

ఈ పిటిషన్లపై ఎన్నికల సంఘం, సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. మిగతా 02లో

సింగరేణిని ప్రైవేటీకరించం

చేయబోం.. చేయనివ్వం: శ్రీధర్‌బాబు

- సింగరేణిని దెబ్బతీస్తున్నది బీఆర్ఎస్ నేతలే
- సింగరేణిని కాపాడింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం


02

భారత్-అమెరికా ట్రేడ్ డీల్

తుది దశకు చేరిన డ్రాఫ్టింగ్!

- అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతుల ప్రయోజనాలే లక్ష్యం
- పోటీ దేశాల సుంకాలతో సమానంగా ఉంటేనే వాణిజ్య ఒప్పందం
- భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు.. చర్చలకు కొత్త సవాళ్లు
- 17న భారత్ కు మార్కో రూబియో


02

బస్తర్‌లో నక్సలిజం విధ్వంసానికి నిదర్శనం

1,570 మందికి పైగా బాధితులు!

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- నక్సలిజంతో గిరిజనుల జీవితాలు ఛిన్నాభిన్నం
- బస్తర్ వేదనను చాటుతున్న గణాంకాలు
- నక్సల్స్ బాధితులకు కృత్రిమ అవయవాలు
- జగదల్‌పూర్ ప్రత్యేక శిబిరంలో 3,600 మందికి పైగా దివ్యాంగులకు లబ్ధి


02

గడ్డంతో న్యూ లుక్..

అసలు కారణం చెప్పిన కేటీఆర్

- రామగుండం పర్యటన నేపథ్యంలోనే ఈ మార్పు అని వెల్లడి
- సోషల్ మీడియాలో వైరల్
- 'మాస్' అంటూ ప్రశంసిస్తున్న పార్టీ శ్రేణులు
- 'ఆ మాత్రం ఉండాలి' అంటూ సరదా వ్యాఖ్య

02



సీఎంసీ కమిషనర్ గారూ.. ఇవి అక్రమ నిర్మాణాలు కాదా?

నల్గగండ్ల హుడా లేఔట్‌లో దందా

- పేరుకే రెసిడెన్షియల్ అంతా కమర్షియల్
- నో పార్కింగ్ స్పేస్.. ప్రమాదకర సెల్లార్ తవ్వకాలు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు


03

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 16 అక్టోబర్, 2026

గోరువెచ్చని నీటితో స్నానం చేయండి

కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారు గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల కండరాల బిగుతు తగ్గి ఉపశమనం పొందవచ్చు. నొప్పి ఉన్న ప్రాంతంలో హాట్ ప్యాక్‌ను కొద్దినేపు ఉపయోగించడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. చర్మం కాలిపోకుండా జాగ్రత్తపడాలి.



యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఈపై

సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎందుకు మార్పు రావడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది తానేనన్నారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితి మారలేదని మండిపడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోనని అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ సంబంధిత విభాగానికి సంబంధించిన అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు కారణం చెప్పొద్దన్నారు.



న్యాయ వ్యవస్థను బెదిరించలేరు

(మొదటి పేజీ తరువాయి)

అయితే నోటీసులు ఇచ్చినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ''మేము నోటీసులు జారీ చేస్తున్నాం, కానీ తదుపరి విచారణ నాటికి ఆయన (రాహుల్ గాంధీ) ప్రవర్తన ఏంటో తెలుసుకోవాలనుకుంటున్నాం' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. నిరసన వ్యవహారాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియాలు కోర్టు దృష్టికి తీసుకురావడంతో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'రాజకీయ ర్యాలీలతో ఈ కోర్టును చుట్టుముట్టడం ఆమోదయోగ్యం కాదు. సుప్రీంకోర్టులో జరగకూడనిది జరిగింది' అని గౌరవ్ భాటియా గుర్తుచేశారు. ఈ సమయంలో సీజేఐ స్పందిస్తూ.. 'న్యాయవ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు' అని తేల్చి చెప్పారు. ఈ నిరసనలు, మార్చ్ అనేవి న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేనని భాటియా పేర్కొనగా.. ఆ ప్రయత్నాలను 'బలహీనమైనవి'గా సీజేఐ అభివర్ణించారు.

'ఇలాంటి బలహీనమైన ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరు. బయట వాళ్లు రకరకాల ప్రకటనలు చేస్తుంటారు.. మేమేమీ అద్దాల మేడల్లో కూర్చోలేదు, బయట ఏం జరుగుతుందో మాకు అన్నీ తెలుసు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే, సుప్రీంకోర్టుకు చేపట్టిన ప్రదర్శన విషయంలో దాఖలైన ప్రత్యేక పిటిషన్‌పై రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌తో పాటు మరికొందరికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇండియా కూటమి నిరసన సమయంలో సుప్రీంకోర్టు ప్రాంగణంలో నమోదైన సీసీటీవీ రికార్డింగ్‌లను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది.

సోమవారం, అక్టోబర్ 12న సెంట్రల్ ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి రాహుల్ గాంధీ నాయకత్వంలో 'ఇండియా' కూటమి మార్చ్ ప్రారంభమై సుప్రీంకోర్టు వరకు సాగింది. ఈ నిరసన వల్ల కోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు. అంతకుముందు, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల సంఘం పని తీరుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రాహుల్ గాంధీ కోరిన అపాయింట్‌మెంట్‌ను సీజేఐ సూర్య కాంత్ తిరస్కరించారు. సదరు అంశాలు ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ సీజేఐ ఆ అభ్యర్థనను తోసిపుచ్చారు. పాలనాపరమైన అంశాల్లో ప్రభుత్వం పనిచేసే తీరులో కోర్టు జోక్యం చేసుకోలేదని, అయితే సరైన ఉపశమనం కోసం న్యాయపరంగా కోర్టును ఆశ్రయించేందుకు నాయకులకు పూర్తి స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి ప్రసాద్ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐకి చెందిన డి. రాజా, జార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన మహువా మాజీ, సీపీఎం నేత ఎంఏ బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఇటి మహమ్మద్ బషీర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో 'ఇండియా' కూటమి తన పది ప్రధాన డిమాండ్లను కోర్టు ముందుంచింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఆదేశించడం, ఎస్ఐఆర్ నిర్ణయాల రాజ్యాంగ చెల్లుబాటును పరిశీలించడం, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం, పిటిషనర్ల ఫిర్యాదులను పరిష్కరించడం, స్వతంత్ర కమిటీతో ఆడిట్ జరిపించడం వంటివి అందులో ఉన్నాయి.


గడ్డంతో న్యూ లుక్

ముద్ర, డెస్క్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తన సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన, ఈసారి గడ్డంతో దర్శనమివ్వడం రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం అంతర్జాలంలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు దీనిని 'మాస్ లుక్' అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

నిన్న రామగుండంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో పాల్గొనేందుకు కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరిన సమయంలో ఆయన గడ్డంతో కనిపించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అనంతరం పర్యటన మార్గమధ్యంలో కరీంనగర్ వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సతీశ్ బాబు వంటి నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తన గడ్డం వెనుక ఉన్న కారణాన్ని కేటీఆర్ సరదాగా వెల్లడించారు.

'ఏందీ సంగతి.. గడ్డం పెంచినవ్?' అని గంగుల కమలాకర్ అడగ్గా, కేటీఆర్ తనదైన శైలిలో నవ్వుతూ సమాధానమిచ్చారు. "పోయేది గోదావరిఖనికే కదా.. సింగరేణికే కదా! ఆ మాత్రం ఉండాలే.. లేకపోతే నడవదు" అంటూ చమత్కరించారు. సింగరేణి ప్రాంత పర్యటనకు వెళ్తున్నందునే ఈ రకంగా సిద్ధమయ్యానని ఆయన చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు.



కేటీఆర్ కొత్త లుక్ పట్ల ఆయన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆయన ఫొటోలను షేర్ చేస్తూ 'బాస్ ఈజ్ బ్యాక్ విత్ ఏ మాస్ లుక్' వంటి కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు తమ ఆహార్యం విషయంలో పెద్దగా మార్పులు చేయరు. అయితే, కేటీఆర్ తన లుక్‌ను మార్చడం, దానికి సింగరేణి ప్రాంతాన్ని ముడిపెడుతూ సరదాగా వ్యాఖ్యానించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

సింగరేణిని ప్రైవేటీకరించం

ముద్ర, హైదరాబాద్:

సింగరేణి సంస్థను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆక్షేపించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సింగరేణిని కాపాడింది.. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'సింగరేణి సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు పెట్టింది. ఈ సంస్థను కేసీఆర్ కుటుంబసభ్యులు జేబు సంస్థగా మార్చుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులు ఇబ్బంది పడ్డారు. వారి సంక్షేమం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదు. సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదు. ప్రైవేటీకరణ చేయబోం.. చేయబోనివ్వం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం.' అని మంత్రి స్పష్టం చేశారు.



విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలి



ముద్ర, హైదరాబాద్:

రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణం ఆపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. 'విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో భారీ స్కామ్‌కు కుట్ర జరుగుతోంది. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం చీకటి ఒప్పందం చేసుకున్నారు. కృత్రిమ బొగ్గు కొరత, కరెంటు సంక్షోభం సృష్టించి.. ఆ కంపెనీని రంగంలోకి దించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలి. మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఇటువంటి వ్యవహారాలను అడ్డుకోవాల్సింది పోయి సహకరిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి చేస్తున్న కుట్రలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

భారత్-అమెరికా ట్రేడ్ డీల్

ముద్ర, న్యూఢిల్లీ:

భారత్–అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మొదటి విడత డ్రాఫ్టింగ్ ఆఖరి దశకు చేరుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చట్టపరమైన ముసాయిదా ప్రక్రియ వేగంగా జరుగుతోందని తెలిపారు. అయితే బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేషియా వంటి పోటీ దేశాల కంటే అమెరికా మార్కెట్‌లో భారతీయ ఎగుమతిదారులకు మెరుగైన లేదా సమానమైన పన్ను ప్రయోజనం లభిస్తేనే ఈ ఒప్పందంపై ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

గతేడాది రెండు దేశాల మధ్య చర్చలు విఫలమైన తర్వాత భారత వస్తువులపై విధించిన 50 శాతం శిక్షాత్మక సుంకాలను, ఈ ఏడాది ఫిబ్రవరిలో కుదిరిన ప్రాథమిక ఒప్పందం ద్వారా 18 శాతానికి తగ్గించారు. భారత్ ఈ ఒప్పందం ద్వారా మెరుగైన మార్కెట్ ప్రాప్యతతో పాటు సుంకాల స్థిరత్వాన్ని కోరుతోందని కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు మధ్యకాలంలో అమెరికాకు భారత వస్తువుల ఎగుమతులు 42.79 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అయితే రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతో, భారతీయ వస్తువులపై 100 శాతం వరకు పన్నులు విధించేలా అమెరికా ఇటీవల తెచ్చిన కొత్త చట్టం ఈ చర్చలకు కొంత ఆటంకంగా మారింది. ఇరు దేశాల మధ్య కొంత ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో.. దౌత్య సంబంధాలను బలపరిచేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్ 17 నుంచి 22 వరకు భారత్, ఉజ్బెకిస్తాన్‌లలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన భారత ప్రభుత్వ ప్రతినిధులు, వ్యాపార దిగ్గజాలతో సమావేశమై ఇంధన సహకారం, వాణిజ్య పెట్టుబడులు, ఆర్థిక సంబంధాలపై విస్తృతంగా చర్చించనున్నారు.



బస్తర్‌లో నక్సలిజం విధ్వంసానికి

నిదర్శనం

ముద్ర, న్యూఢిల్లీ :

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రథసారధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'సేవ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇవాళ ఢిల్లీ నుంచి జూమ్ మీటింగ్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ బాధితులు, ఇతర దివ్యాంగులతో మాట్లాడిన ఆయన, నక్సలిజం మూలంగా వైకల్యం బారినపడిన గిరిజనులకు ఈ అభియాన్ కింద కృత్రిమ అవయవాలను అందిస్తుండటం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు జగదల్‌పూర్ (Jagdalpur)లో నిర్వహించిన స్పెషల్ క్యాంప్ ద్వారా ఏకంగా 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్ షా తెలిపారు. కేవలం బస్తర్ (Bastar) ప్రాంతంలోనే 1,570 మందికి పైగా బాధితులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సంఖ్యే బస్తర్ పడుతున్న వేదనను, బాధను స్పష్టంగా దేశానికి తెలియజేస్తోందని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర రూపం దాల్చిన నక్సలిజం వల్ల బస్తర్‌లోని నిరుపేద గిరిజనులు ఏ విధంగా దెబ్బతిన్నారో ఈ గణాంకాలే యావత్ ప్రపంచానికి చాటిచెబుతున్నాయని అమిత్ షా స్పష్టం చేశారు.



కలాం సేవలు దేశానికి

స్ఫూర్తిదాయకం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



ముద్ర, హైదరాబాద్ :

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభతో దేశ రక్షణ రంగానికి దిశానిర్దేశం చేశారని, క్షిపణి, రాకెట్ సాంకేతికత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి భారతదేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా పెంచారని కొనియాడారు. యువత ఆయన దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు బోనస్ ప్రకటించడం, దివ్యాంగుల పెన్షన్ అర్హత ప్రమాణాన్ని 80 శాతం నుంచి 40 శాతానికి తగ్గించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన రాంచందర్ రావు, సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ నేతలు 'ఓట్ చోరీ' అంటూ రాజకీయ విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

అనంతరం అంతర్జాతీయ వైట్ కేన్ డే సందర్భంగా బీజేపీ దివ్యాంగుల సెల్ ఆధ్వర్యంలో దృష్టి లోపం ఉన్న పలువురికి వైట్ కేన్ స్టిక్స్‌ను రాంచందర్ రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా, దివ్యాంగుల సెల్ నాయకులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 16.10.2026
www.mudranews.in | @mudranews

రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయండి

ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల కీళ్లు పట్టుకు పోవచ్చు. అందుకే నడక, తేలికపాటి స్ట్రెచింగ్స్ వంటి వ్యాయామాలను అలవాటు చేసుకోవాలి. అయితే నొప్పి పెరిగేలా చేసే వ్యాయామాలకు దూరంగా ఉండాలి.



ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి.. యాసంగిలో వరి సాగు తగ్గించాలి

రాష్ట్రంలో నీటి ఎద్దడి ముప్పు.. ప్రజలు చుక్కచుక్క నీటిని ఆదా చేయాలి

విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది.. కేంద్రం సహకరించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

ముద్ర, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో రానున్న రోజుల్లో తీవ్ర ఎండలు, తాగునీటి కొరత, విద్యుత్ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వచ్చే యాసంగి సీజన్‌లో వరి సాగును తగ్గించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంపై మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

209 టీఎంసీల నీరే అందుబాటులో ఉంది

రాష్ట్రంలో నీటి వనరుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సీఎం తెలిపారు. కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం మేర తక్కువగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో 23 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 460 టీఎంసీల నీరు అవసరమయ్యే పరిస్థితుల్లో ప్రస్తుతం కేవలం 209 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని వివరించారు.

రాష్ట్రంలోని 24 వేల గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉందని, రానున్న ఎనిమిది నుంచి పది నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వాహనాలు కడగడం వంటి అవసరాలకు నీటిని వృథా చేయవద్దని, ప్రతి చుక్కను ఆదా చేయాలని కోరారు.



యాసంగిలో వరి సాగు తగ్గించాలి

తెలంగాణలో 56 లక్షల ఎకరాల్లో వరి, 13 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వచ్చే అవకాశం ఉందని, చేతికొచ్చిన పంట ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని వచ్చే యాసంగిలో వరి సాగును తగ్గించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మి వరి సాగు చేపడితే నారుమళ్ల దశలోనే పంట ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట నష్టపోయిన రైతులతో పాటు, నీటి కొరత కారణంగా వచ్చే సీజన్‌లో సాగు చేయలేని రైతులను కూడా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు..

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెరిగిందని సీఎం వెల్లడించారు. సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు పనిచేస్తుండటంతో డిమాండ్ పెరిగిందన్నారు. మార్కెట్‌లో ఎంత ధరకు విద్యుత్ లభించినా కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు అధికారులను అభినందించారు.

విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి అవసరమైన రాష్ట్రాలకు తక్కువ ధరకు విద్యుత్ అందించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించాలని సూచించారు.

కేంద్ర సాయం కోసం అఖిలపక్ష బృందం

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అనంతరం అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలుస్తామని వెల్లడించారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు.

నీటి సంరక్షణ, చెరువులు, కుంటల మరమ్మతులకు ఉపాధి హామీ పనుల్లో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందించేలా చర్యలు చేపడతామన్నారు. వాతావరణ మార్పుల వల్ల ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యారోగ్య శాఖను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.ప్రజల్లో అవగాహన కోసం కళాజాతాలు నిర్వహిస్తామని, సినీ నటులు, క్రీడాకారులు, జర్నలిస్టుల సహకారం తీసుకుంటామని తెలిపారు. మీడియా కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు.ఎల్‌నినోను ఎదుర్కోవడం ప్రభుత్వ ఒక్కదాని బాధ్యత కాదని, ప్రజలు, రైతులు, రాజకీయ పార్టీలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. పరిస్థితిని అధిగమించగలమన్న విశ్వాసం తనకు ఉందని స్పష్టం చేశారు.

లోక్‌భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ముద్ర, హైదరాబాద్ : బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీక అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం లోక్ భవన్ లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన సతీమణి జానకి శుక్లాతో కలిసి పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం కలగాలని ప్రార్థించారు.ఈ వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం గవర్నర్ సతీమణి, మహిళా ఉద్యోగులు లోక్ భవన్ లోని కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో లోక్ భవన్ పండుగ శోభను సంతరించుకుంది.

నేరాల నియంత్రణకు పటిష్ఠ గస్తీ చేపట్టాలి

డీజీపీ సీవీ ఆనంద్

ముద్ర, హైదరాబాద్ : మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు నిరంతర గస్తీ, పటిష్ఠ నిఘా, సత్వర స్పందనకు ప్రాధాన్యమివ్వాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం సీపీ సుమతితో కలిసి నిర్వహించిన సమీక్షలో దొంగతనాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలికల భద్రతపై చర్చించారు. నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. పోక్సో కేసుల్లో సాంకేతిక ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. ట్రాఫిక్ ప్రమాదాల నివారణకు హాట్‌స్పాట్లను గుర్తించి చర్యలు చేపట్టాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో 2026లో ఇప్పటివరకు 23,747 కేసులు నమోదైనట్లు అధికారులు వివరించారు. పెరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు.

లలితా గౌరి త్రిపుర సుందరిగా నిమిషాంబ దేవి దివ్యదర్శనం



ముద్ర, బోడుప్పల్: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బోడుప్పల్‌లోని లోకపావని శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారు శ్రీ లలితా గౌరి త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. జ్ఞానప్రదాయినిగా, విద్యాస్వరూపిణిగా, సృష్టి, స్థితి, లయకారిణిగా విరాజిల్లిన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపి పీఠం ఆధ్వర్యంలో శ్రీ మాతా నిమిషాంబ దేవి ట్రస్ట్ నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ప్రత్యేక అలంకరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. లలితా గౌరి త్రిపుర సుందరి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల జ్ఞానం, శక్తి, సకల శుభాలు, ఐశ్వర్యాలు, అభీష్టసిద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం. అమ్మవారి అనుగ్రహంతో జీవితంలోని ఆటంకాలు తొలగి, సుఖశాంతులు చేకూరుతాయని భక్తులు నమ్ముతారు. 'అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.. అమ్మ కటాక్షం ఉంటే అసాధ్యమేదీ లేదు' అనే ఆధ్యాత్మిక భావనతో భక్తులు అమ్మవారిని ఆరాధించారు.

సందడిగా ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన ముద్ర ఎండీ కే. సత్యనారాయణ, ఫారెస్ట్ నేషన్ సీఎండీ నల్లమోతు శరత్



ముద్ర, హైదరాబాద్: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన వేడుకలు సందడిగా సాగాయి. సర్వమత ప్రార్థనలతో వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్, ఇతర నాయకులు ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీవాసులు తదితరులు పాల్గొని గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు.



ముద్ర ఎండీ కే. సత్యనారాయణ, ఫారెస్ట్ నేషన్ సీఎండీ నల్లమోతు శరత్ సైతం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి : భట్టి

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో ద్వారా అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్–2026లో ఆయన మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏఐ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గోదావరి పుష్కరాలకు రూ.1,000 కోట్ల ఖర్చు వద్దు


ప్రతిపాదనను పునఃపరిశీలించాలి.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి



ముద్ర, హైదరాబాద్: రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రతిపాదించినట్లు చెబుతున్న రూ.1,000 కోట్ల వ్యయాన్ని పునఃపరిశీలించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి అక్టోబర్ 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గత పుష్కరాల సందర్భంగా స్నాన ఘాట్లు, రహదారులు, షెల్టర్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, వాటి వినియోగం ఆశించిన స్థాయిలో లేదని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారీ నిర్మాణాల కంటే శాంతిభద్రతలు, తాగునీరు, వైద్య సేవలు, తాత్కాలిక మరుగుదొడ్లు, యాత్రికుల భద్రత వంటి ప్రాథమిక సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పుష్కరాలు, జాతరలు, బోనాల వంటి ఉత్సవాలకు భారీగా ఖర్చు చేసే విషయంలో సంయమనం పాటించాలని ఫోరం కోరింది. అత్యవసరమైన పనులకే నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సీఎంసీ కమిషనర్ గారూ...ఇవి అక్రమ నిర్మాణాలు కాదా?

- **నల్లగండ్ల హుడా లే ఔట్ లో నయా దందా...**
- **పేరుకే రెసిడెన్షియల్ అంతా కమర్షియల్**
- **నో పార్కింగ్ స్పేస్....ప్రమాదకర సెల్లార్ తవ్వకాలు**
- **చేతులు మారుతున్న లక్షల రూపాయలు**





ముద్ర, శేరిలింగంపల్లి: అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ లక్షల గొంతుకలు మోగుతున్నాయి. వేళల్లో ప్రభుత్వ ఆర్డర్లు, సర్కులర్లు అధికారులు విడుదల అవుతూనే ఉంటాయి. ఆ సర్కులర్ల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఉండే అధికారులు హడావిడి చేస్తూనే ఉంటారు...కానీ ఫలితం శూన్యం. ఇటీవలి కాలంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ లో అంజయ్య నగర్ లో అనుమతులు లేని భవనం కూలాక ప్రభుత్వ యంత్రాంగం తెగ హడావిడి చేసింది. కనిపిస్తే కాల్చివేస్తాం అన్నట్టుగ...కన్పిస్తే కూల్చివేస్తాం అంటూ మున్సిపల్ సిబ్బంది అంతా సరుకు– సరంజామాతో పలు ప్రాంతాలు కలియ తిరగడం మొదలు పెట్టారు. ఆ హడావిడి అంతా మూనాళ్ల ముచ్చటగానే మారింది. హైదరాబాద్ భాగ్యనగరంలోనే అత్యంత ప్రైమ్ లొకేషన్ గా చెప్పుకునే శేరిలింగంపల్లిలో నల్లగండ్ల హుడా లే ఔట్ ఒకటి. నల్లగండ్లలో నయా దందా నడుస్తోంది. చూడటానికి రెసిడెన్షియల్ ఏరియాలా కన్పించినా...అక్కడ సమస్తం కమర్షియల్. నల్లగండ్లలోని కాలనీలకు మున్సిపల్ శాఖ రోడ్లు, డ్రైనీజీ, వీధి దీపాలు వంటి సౌకర్యాలు ముందే కల్పించింది. అయినా అక్కడి ప్లాట్ల యజమానులు అదనపు ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఓ రియలర్ట్ ఏకంగా నాలుగు ప్లాట్లలో నిర్మాణాలు చేపడుతూ భారీ అక్రమాలకు తెరతీసారు. పార్కింగ్ స్థలం లేకుండా ఓ భవనం నిర్మించి కమర్షియల్ గా అద్దెకివ్వడం, మరో భవనంలో నిషిద్ధ సెల్లార్ తవ్వి పార్కింగ్ కోసం కేటాయించి ప్రమాదాలకు తెరలేపడం, మరో భవనానినికి నాలుగంతస్థుల అనుమతి పొంది మరో రెండంతస్థులు అదనంగా నిర్మించి వ్యాపార సంస్థలకు అద్దెకిచ్చిన వ్యవహారం అక్కడ బహిరంగం. హుడా లే ఔట్ లో ఇలాంటి అక్రమ నిర్మాణాలు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తే...ఇదంతా అధికారులకు తెలుసు లే అని బుకాయించడం, ఇదేంటని అధికారులను 'ముద్ర' ప్రశ్నిస్తే ఇదిగో చర్యలు తీసుకుంటాం...అదిగో నోటీసులు ఇచ్చామంటూ కాలయాపన చేయడం...పుణ్యకాలం కాస్తా గడిచిపోయి... నిర్మా ణం పూర్తయ్యాక ఇక చేసేదేముంటుంది....నిర్మాణం పూర్తయిందని తప్పించుకోవడం...అధికారులకు ఇదంతా షరా'మామూలే'. ఇటీవల కాలంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తోందని ప్రచారం జరుగుతున్నప్పటికీ ...అక్రమ నిర్మాణాల వేగం అదే స్థాయిలో కొనసాగుతోందని నల్లగండ్ల హుడా లేఔట్ లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను చూస్తే స్పష్టమౌతోంది. చర్యలు ఎన్ని తీసుకున్నా....చట్టాలు ఎన్ని చేసినా ఈ అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేదెలా అనేది ప్రశ్నార్థకంగానే మారింది.

సింగరేణి గనులను మూసేసి 40 వేల మంది కార్మికుల పొట్టకొట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దే!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ రెడ్డి గెలుపే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యం కావాలి

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ముద్ర, వరంగల్ / హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక సంస్థ సింగరేణిలో 18 గనులను మూసివేసి, 40 వేల మంది కార్మికుల జీవితాలను రోడ్డున పడేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సింగరేణి విషయంలో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని, పదేళ్ల అధికారంలో ఒక్క గనినైనా కాపాడలేకపోయారని మండి పడ్డారు. అప్పట్లో గనుల వేలంపాటలో పాల్గొనకుండా సింగరేణికి అన్యాయం చేసిన బీఆర్ఎస్‌కు ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడు గనుల వేలంపాటలో పాల్గొని సింగరేణిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. గురువారం వరంగల్‌లో నిర్వహించిన వరంగల్–నల్గొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రసంగించారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐతో కలిపి 32 స్థానాల్లో కాంగ్రెస్ పక్షం బలంగా ఉందని మంత్రి తెలిపారు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనూ గతంలో కాంగ్రెస్‌కు గట్టి పట్టు ఉందని గుర్తుచేశారు. ఈ రాజకీయ బలాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంగా మలచుకోవాలని, కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేసి, పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు సర్వోత్తమ రెడ్డికి వేయించేలా కృషి చేయాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఓటు నమోదు, రెన్యువల్‌కు అవకాశం ఉన్న నేపథ్యంలో దసరా సహా పండుగలకు స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను గుర్తించి, అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా చూడాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఒక్క వరంగల్ జిల్లాలోనే సుమారు 47 వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, అర్హులైన ఓటర్లందరి ఓటు నమోదు, రెన్యువల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడం పార్టీ ఎన్నికల సన్నద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజలకు అనుకూలంగా పనిచేయాలంటే కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని పొంగులేటి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోరాటానికి మరింత బలం చేకూర్చేలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్న లక్ష్య సాధన దిశగా కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ పరస్పర అవగాహనతో పనిచేస్తున్నాయని విమర్శించిన మంత్రి, ఆ పార్టీల రాజకీయ వ్యూహాలను కాంగ్రెస్ కార్యకర్తలు సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, సర్వోత్తమ రెడ్డి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 16 అక్టోబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

కన్నడంలో భగీరథ
నాగలాదేవి



ప్రపంచంలో శిల్పకళా వారసత్వంలో విజయనగర సామ్రాజ్యంకు సముచిత మైన స్తానం ఉన్నదని, శ్రీకృష్ణదేవరాయల కాలం స్వర్ణ యుగమని , అలాంటి రాయలవారి ప్రేమకథను 'నాగలాదేవి ' పేరుతో గ్రంధస్థము చెయ్యడం సంతోషంగా ఉందని విజయనగర శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కులపతి ప్రొ. ఎం మునిరాజు పేర్కొవున్నారు .

శ్రీగంగ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి సంస్థ హంపిలోని విరూపాక్ష దేవాలయంలో 'నాగలాదేవి ' కన్నడ నవల ఆవిష్కరణ సభను ఏర్పాటు చేసింది . భగీరథ తెలుగులో రచించిన 'నాగలాదేవి ' నవలను కన్నడంలోకి డాక్టర్ దేవన్న అనువదించారు. ఈ పుస్తకాన్ని మునిరాజు ఆవిష్కరించారు . ఈ సందర్భగా భగీరథ , దేవన్నను ఆయన అభినందించారు .

ప్రొ. బీసీ ఐగోల్ 'నాగలాదేవి' గురుంచి మాట్లాడుతూ – చరిత్రలోని ఒక సరికొత్త కోణాన్ని ఇందులో భగీరథ గారు ఆవిష్కరించారు . ఇది గొప్ప పరిశోధనా గ్రంథమని , కన్నడంలోకి నాగన్న సమర్థవంతంగా అనువదించారని చెప్పారు.

భగీరథ మాట్లాడుతూ – కృష్ణదేవరాయలు, నాగలాదేవి నడయాడిన విరుపాక్ష దేవాలయంలో ఈ కార్యక్రమం జరగాలని నేను అనుకున్నాను, దానిని దేవన్న నెరవేర్చారు . కన్నడంలో కూడా ఈ నవల పండిత పామరుల అభిమానం సంపాదిస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు . నాగలాదేవి నవల వ్రాయడం కోసం 15 సంవత్సరాలు పరిశోధన చేశానని , శాసనాల సాక్షిగా దీనిని వ్రాయడం జరిగిందని పేరొకొన్నారు.

కన్నడ అనువాదకుడు డాక్టర్ దేవన్న మాట్లాడుతూ–ఈ నవలను కన్నడంలోకి అనువదించాడని భగీరథ గారు అనుమతించడం అరుస్తామని, నగలదేవిని కన్నడ పాఠకులు అభిమానించి ఆదరిస్తారననే నమ్మకం ఉందని చెప్పారు .

ఆర్టిస్ట్ డాకోజు శివ ప్రసాద్ అహో ఆంధ్ర భోజ శ్రీకృష్ణదేవరాయ అనే గీతాన్ని ఈ సందర్భగా పాడి వినిపించారు. సభకు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రుద్రప్ప అధ్యక్షత వహించారు . ఇంకా సభలో కన్నడ విశ్వవిద్యాలయం ప్రొ. సోమశేఖర్, శ్రీమతి అన్నపూర్ణ సింగ్, పారిశ్రామికవేత్త భీమనేని భాస్కరనాయుడు, శ్రీనివాస రెడ్డి, పాటి సుబ్బారావు , బెల్లా తెలుగు సాంస్కృతిక సంఘం కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు . అతిథులను అధ్యక్షులు శకుంతల సత్కరించగా, కార్యదర్శి. డా. ఆర్. వాత్సల్య వందన సమర్పణ చేశారు.

వేడి కురుపులు తగ్గించుకోండి ఇలా!



మన శరీరంలో వేడి పెరిగినప్పుడు లేదా ఇన్ఫెక్షన్లు తీవ్రమైనప్పుడు ముఖం, మెడ, వీపు వంటి భాగాలపై వేడి కురుపులు, చీము గడ్డలు ఏర్పడటం సాధారణంగా చాలా మందిని వేధించే సమస్య. ఈ కురుపులు తీవ్రమైన మంట, పోటు వల్ల రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఈ వేదన నుంచి ఉపశమనం పొందడానికి ప్రతిసారీ మెడిసిన్స్ లేదా యాంటీబయోటిక్స్ వాడాల్సిన పని లేదు. మన ఇంటి వద్దనే అందుబాటులో ఉండే సహజసిద్ధమైన ఔషధ మూలికలు, ఆకులు వంటి సాంప్రదాయ చిట్కాలతో సమస్యను సులభంగా నయం చేసుకోవచ్చు.

మనకు అందుబాటులో ఉండే రణపాల ఆకు, తమలపాకు, ఆముదం, పసుపు వంటి మన వంటింటి దినుసులతో ఈ గడ్డలను త్వరగా మెత్తబరిచి, చీమును బయటకు రప్పించవచ్చు. ఈ నేపథ్యంలో అసలు వేడి కురుపులు రావడానికి కారణాలు ఏంటి, వాటిని తగ్గించే అద్భుతమైన ఇంటి చిట్కాలు, తీసుకోవాల్సిన ఆహారాల గురించి ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.

వేడి కురుపులు రావడానికి కారణాలు

శరీరంలో అధిక వేడి పెరగడం వేడి కురుపులు రావడానికి ప్రధాన కారణం. సరిపడా నీళ్లు తాగకపోవడం వల్ల శరీరంలో ఇన్ఫెక్షన్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవడం వల్ల కూడా చీము గడ్డలు ఏర్పడతాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, రోగనిరోధక శక్తి తగ్గడం కూడా ఈ సమస్యను తీవ్రం చేస్తుంది. అలాగే ఎండలో ఎక్కువగా తిరగడం లేదా బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం వల్ల చెమట పట్టి కురుపులు పెరుగుతాయి. ఇక మసాలాలు, వేయించిన ఆహారాలు ఎక్కువగా తినడం వల్ల కూడా ఇవి వస్తుంటాయి.

శొంఠి పొడి + పసుపు మిశ్రమం

శొంఠి, పసుపు రెండింటిలోనూ శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయని Cytokine అధ్యయనం పేర్కొంది. కాబట్టి ఒక అర టీ స్పూన్ శొంఠి పొడికి, అర టీ స్పూన్ పసుపు పొడిని కలపాలి. దీనికి కొద్దిగా పాలు లేదా నీళ్లు కలిపి పేస్ట్‌లా చేసి కురుపుల మీద పూయాలి. పసుపు సహజసిద్ధమైన యాంటీబయోటిక్‌గా పనిచేసి బ్యాక్టీరియాను చంపుతుంది. శొంఠి గడ్డల్లోని వాపును, గట్టిదనాన్ని తగ్గించి త్వరగా మానేలా చేస్తుంది. ఈ మిశ్రమాన్ని రోజుకు రెండు సార్లు రాస్తే చీము గడ్డలు తగ్గిపోతాయి.

కర్పూరం + తెల్ల మిరియాలు

ఈ కర్పూరం, తెల్ల మిరియాల మిశ్రమం క్రిమి సంహారకంగా పనిచేస్తుంది. తెల్ల మిరియాలను మెత్తటి పొడిగా చేసుకుని దానికి కొద్దిగా కర్పూరం పొడి కలపాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా నీరు లేదా కొబ్బరి నూనె కలిపి చిక్కటి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను వేడి కురుపులపై రాసి కాసేపు ఆరనివ్వాలి. కర్పూరంలో ఉండే చల్లదనం కురుపుల వల్ల వచ్చే తీవ్రమైన మంట, నొప్పిని వెంటనే తగ్గిస్తుంది. తెల్ల మిరియాలు ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా బ్యాక్టీరియాను నశింపజేస్తాయి.

రణపాల ఆకు + ఆముదం

రణపాల ఆకుకు చర్మ ఇన్ఫెక్షన్లను తగ్గించే అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయి. ఒక రణపాల ఆకును తీసుకుని కొద్దిగా ఆముదం రాయాలి. ఈ ఆకును లైట్‌గా గ్యాస్ మీద వేడి చేయాలి. వేడి కురుపు లేదా చీము గడ్డలు ఉన్న చోట పెట్టాలి. ఆకు ఊడిపోకుండా కాటన్ బట్టతో లేదా ప్లాస్టర్‌తో సున్నితంగా కట్టు కట్టాలి. ఆముదం, రణపాల కాంబినేషన్ కురుపులోని చీమును త్వరగా బయటకు లాగేస్తుంది. ఈ చిట్కాను ప్రతిరోజూ పడుకునే ముందు పాటిస్తే రెండు మూడు రోజుల్లో చీము, వాపు, నొప్పి తగ్గుతాయి.

తమపాలకు చిట్కా

తమలపాకులను పూర్వం నుంచి వేడి కురుపుల నివారణకు అద్భుతమైన ఔషధంగా ఉపయోగిస్తున్నారని SAJC అధ్యయనం పేర్కొంది. ఒక తమలపాకును తీసుకుని దానికి కొద్దిగా ఆముదం లేదా నువ్వుల నూనె రాయాలి. ఆ ఆకులను స్వల్పంగా వేడి చేసి వేడి కురుపులు లేదా చీము గడ్డలపై పెట్టి కట్టులా కట్టాలి. తమలపాకులోని రసాయనాలు గడ్డను బాగా మెత్తబరిచి చీమును సులభంగా బయటకు వచ్చేలా చేస్తాయి. ఇది కురుపు వల్ల వచ్చే తీవ్రమైన పోటు, మంట నుంచి తక్షణ ఉపశమం ఇస్తాయి. ఈ చిట్కాను రోజుకు ఒకసారి చొప్పున క్రమం తప్పకుండా ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది.

తీసుకోవాల్సిన ఆహారాలు

శరీరంలో వేడి తగ్గించే చలువ చేసే ఆహారాలను రోజువారీ డైట్‌లో భాగం చేసుకోవాలి. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి. ఇక మజ్జిగ, కొబ్బరి నీళ్లు, సబ్జా గింజలు నీళ్లు తరచూ తాగుతుంటే శరీరం చల్లబడుతుంది. పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి. ముఖ్యంగా కారం, మసాలాలు, ఆయిల్ ఫుడ్స్, జంక్ ఫుడ్‌ను పూర్తిగా పక్కన పెట్టడం మంచిది. ఆకుకూరలు బాగా తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి శరీరం వేడి తగ్గుతుంది.

జీవనశైలి (Lifestyle)



రోజువారీ వ్యాయామం: రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వేగంగా నడవడం, యోగా లేదా నచ్చిన వ్యాయామం చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.

తగినంత నిద్ర: రాత్రి వేళల్లో 7 నుండి 8 గంటల ప్రశాంతమైన నిద్ర శరీర పునరుత్తేజానికి చాలా అవసరం.

నీరు ఎక్కువగా తాగాలి: రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల నీరు తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది మరియు చర్మం కాంతివంతంగా మారుతుంది.

లూజ్ మోషన్స్ తగ్గడానికి
ఇంటి చిట్కాలు

కడుపులో తిప్పడం, పదే పదే మోషన్స్‌కి పరిగెత్తడం.. ఒక్కసారి విరేచనాలు మొదలయ్యాయంటే ఒంట్లోని శక్తి మొత్తం పిండేసినట్లు అయిపోతుంది. ఏమీ తినబుద్ధి కాదు, నిలబడే ఓపిక కూడా ఉండదు. వాతావరణంలో మార్పులు వచ్చినా, బయట కాస్త తేడా ఉన్న ఆహారం లేదా నీళ్లు తాగినా మోషన్స్ ఇబ్బంది పెడతాయి. విరేచనాల వల్ల శరీరంలో నీటి శాతం, ముఖ్యమైన ఎలక్ట్రోలైట్లు వేగంగా తగ్గిపోయి తీవ్రమైన నీరసం వస్తుంది.

ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే యాంటిబయోటిక్స్ లేదా కేవలం కెమికల్ మెడిసిన్స్ వైపు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా, మన వంటింట్లో లభించే అనేక సహజ పదార్థాలు విరేచనాలను వెంటనే అదుపు చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. జాజికాయ, జామ ఆకుల కషాయం, దానిమ్మ తొక్కల రసం, మజ్జిగ–మెంతులు వంటి ఇంటి చిట్కాలతో పాటు విరేచనాలు కడుపును వెంటనే శాంతింపజేసి, విరేచనాలను అదుపులోకి తెచ్చే మరికొన్ని పవర్‌ఫుల్ చిట్కాలు తెలుసుకుందాం..

జాజికాయ + తేనె

ప్రాచీన ఆయుర్వేదంలో జాజికాయ విరేచనాలకు అద్భుతమైన మందుగా పనిచేస్తుంది. కొద్దిగా జాజికాయను సానరాయిపై అరగదీసి, ఆ గంధాన్ని లేదా పొడిని అర టీస్పూన్ మోతాదులో కొద్దిగా తేనెతో కలిపి తీసుకుంటే లూజ్ మోషన్స్ వెంటనే కంట్రోల్ అవుతాయి. ఇది ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరించి, కడుపులో కలిగే తిమ్మిరి, నొప్పిని తగ్గించడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది.

జామ ఆకుల కషాయం

జామ ఆకులు విరేచనాలకు దివ్యౌషధంలా పనిచేస్తాయని International Journal of Global Operations Research అధ్యయనం పేర్కొంది. జామాకుల్లో యాంటీబాక్టీరియల్, యాస్ట్రింజెంట్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. మీరు విరేచనాలతో ఇబ్బంది పడుతుంటే నాలుగు నుంచి ఐదు లేత జామ ఆకులను శుభ్రం కడిగి ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరగబెట్టాలి. ఆ నీటిని వడకట్టి గోరువెచ్చగా తాగితే ప్రేగులలో ఉన్న ఇన్ఫెక్షన్లు, వాపు తగ్గి విరేచనాలు త్వరగా అదుపులోకి వస్తాయి.

ఉడకబెట్టిన అరటిపండు

విరేచనాలు అవుతున్నప్పుడు శరీరం తేలికపాటి ఆహారాన్ని మాత్రమే అరిగించుకోగలదు. అరటిపండును తొక్కతో సహా ఉడకబెట్టి, ఆ తర్వాత తొక్క తీసి మెత్తగా గుజ్జులా చేసి తింటే అందులోని పెక్టిన్ అనే పీచు పదార్థం పల్చటి మోషన్‌ను గట్టిపడేలా చేస్తుంది. ఇది ప్రేగులకు బలాన్ని ఇవ్వడమే కాకుండా శరీరానికి అవసరమైన పొటాషియాన్ని అందించి తక్షణ శక్తిని ఇస్తుంది.

మజ్జిగ, మెంతుల పొడి

పల్చటి మజ్జిగలో వేయించిన మెంతుల పొడి కలిపి తీసుకుంటే విరేచనాలకు అద్భుత ఫలితాన్ని ఇస్తుంది. ఒక గ్లాసు ఫ్రెష్ మజ్జిగ



లో అర స్పూన్ వేయించిన మెంతి పొడి వేసి తాగితే ప్రేగులలో ఉండే అధిక వేడి తగ్గి, హానికర బాక్టీరియా నశిస్తుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను సమస్థితికి తెచ్చి కడుపును వెంటనే శాంతింపజేస్తాయి. కాలంతో సంబంధం లేకుండా ఏ కాలమైనా మజ్జిగ తీసుకోవడం మంచిది. అలాగే మెంతులు అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఉపయోగపడుతుందని NFSR అధ్యయనం పేర్కొంది.

మీకు నచ్చిందే చేయండి!

చాలామంది పిల్లలు ఒక కోర్సును పూర్తిచేసి, మరొక కోర్సుకు ఎంచుకుంటారు. పూర్తి చేసిన కోర్సు వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో తెల్సుకోకుండానే రెండవ కోర్సులోకి వెళ్తారు. రెండవది కూడా పూర్తి చేసిన తర్వాత దాని గురించి కూడా తెల్సుకోకుండానే పాక్షికమైన సమాచారంతో ఉపాధి యత్నాలు, విదేశాలలో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తారు. కానీ అలాంటి కోర్సుల పట్ల పూర్తి అవగాహన కోర్సు చేసేటప్పుడే తెల్సుకుంటే ఎలాంటి ఆందోళన అవసరం లేదు. అలాంటివారి కోసమే ఓ చిన్న కథను చదవండి.



డా.మహ్మద్ హసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కెరీర్ కౌన్సిలింగ్ కోచ్
9908059234

ఓ మనస్తత్వ శాస్త్రవేత్త చింపాంజీ ప్రవర్తనపై అద్భుతమైన ప్రయోగం చేశాడు. ఒక చింపాంజీని పెద్ద పంజరంలో బంధించి ప్రతిరోజు అరటిపండ్లను ఇచ్చేవాడు. అలా అరటిపండ్లను ఇవ్వడానికి ముందు చింపాంజీకి అందకుండా దూరంగా శుభ్రంగా ఉండే పెద్ద సైజులో ఉన్న ఓ అరటిపండును పెట్టాడు. అయితే చింపాంజీ పంజరం ముందున్న ఆ అరటిపండును చూసి దాన్ని ఎలాగైనా అందుకోవాలని దానిని తినాలని చేతులతో దానిని దగ్గరికి తీసుకొనే ప్రయత్నం చేసేది. కానీ అది అందనంత దూరంలో ఉంది. ఆ తరువాత తన పంజరంలోకి వచ్చి పడే ఎంత పరిశుభ్రంగా ఉండే అరటిపండ్లను పెట్టినా కూడా దానికి అందని దూరంలో ఉన్న 'అరటిపండు' కోసం మాత్రమే 'ప్రయత్నం' చేసేది. ఇలా కొద్ది రోజుల ప్రయత్నం తరువాత దాని చుట్టూ ఎన్నో అరటిపండ్లు వున్నా వాటిని తినకుండా దానికోసమే (అందని అరటిపండు కోసం) అది తినకుండా ఆహారం మానేసి అది దొరకలేదనే ఆలోచనతో కొన్ని రోజుల తరువాత ఆ చింపాంజీ ఆ పంజరంలోనే చనిపోయింది. ఎంత బాధ కల్గించే సంఘటన ఇది ఆలోచించండి? కానీ ఆ శాస్త్రవేత్త ఆ పెద్ద అరటిపండును ఓ బొమ్మలా (Model Banana) పెట్టాడు. కానీ అది నిజమైన అరటిపండు కానే కాదు. వాస్తవంగా మన జీవితంలో కూడా సామాజిక మాధ్యమాలలో వచ్చే రీల్స్, వాట్సప్ మొదలైన వాటిని ఎవరో అపరిచిత వ్యక్తులు వారి జీవితంలో జరిగిన సంఘటనలను ఎడిట్ చేసి పెట్టిన వాటిని చూసి భ్రాంతిలో పడి మనం ఎందుకు అలా ఎదగలేకపోతున్నామ్ అని మదనపడుతూ ఉంటామ్. కానీ వాస్తవం ఏమిటంటే కాలం మీకు ఎన్నో అమూల్యమైన అవకాశాలను మీ ముందుంచుతుంది. వాటిని సద్వినియోగం చేసుకోకుండా ఇతరులు పెట్టిన పోస్టుల గురించి ఆలోచిస్తూ విలువైన కాలాన్ని దుర్వినియోగం చేస్తారు.

జీవితం అంతా నిరాశ, నిస్సారంగా ఉందని, వారి జీవితంలో అద్భుతమైన మలుపులు ఉన్నాయని భ్రమిస్తామ్. కానీ ఆ పోస్టులు పెట్టిన వారి నేపథ్యం మీ కన్నా బాధాకరంగా, పేదరికంతో మగ్గిపోయిన జీవితాల్లో నుండి వచ్చిన వారే అన్న సంగతి మరువకూడదు. వాటిని వారు చూయించకుండా కేవలం 'సక్సెస్'ను మాత్రమే సోషల్ మీడియా పోస్టులు పెడతారు.

అంతెందుకు ఈ మధ్యనే భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశి వయస్సు కేవలం 15 సంవత్సరాలు మాత్రమే. బీహార్‌లోని ఓ మారుమూల పల్లెటూరి కుర్రవాడు నేడు ఈ స్థాయి రికార్డుల సునామి వెనుక సంవత్సరాల కఠోరమైన సాధన ఉందన్న విషయం మరువకూడదు. అలా గే తెలుగు, తమిళం, మలయాళం సినిమాలలో ఇటీవ లే వరుస విజయాలు అందుకుంటున్న యువనటి మమితా బైజు నీట్ పరీక్షలో ఆశించిన ర్యాంక్ రాక పోగా ఆకాస్మాత్తుగా వచ్చిన సినిమా అవకాశాలను ఉపయోగించుకొని నేడు అగ్ర



స్థానంలో కొనసాగుతుంది. కాబట్టి విజయాలు ఎవరికీ కూడా రాత్రికి రాత్రే వరించవు. ఎవరి జీవితం అయినా తీసుకోండి. ఎవరి విజయాలైనా చదవండి. కేవలం ఒక్క రోజులో 'విజయం' సాధించినవారు ఎవరూ ఉండరు. కాబట్టి 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నారు పెద్దలు. ఏ పనైనా సాధన చేస్తున్న కొద్దీ అందులో అనుభవం వస్తుంది. నైపుణ్యం మెరుగుపడుతుంది. అంతిమంగా అందులో మీ పరిపక్వమైన పనితీరు ఆధారంగా ఫలితం మీకు అనుకూలంగా వస్తుంది. మధ్యలో ఏవో చిన్న చిన్న అవాంతరాలు సహజంగా ఎందులోనైనా వస్తాయి. ఆటంకాలు లేని రంగం ఏదైనా ఉందా చెప్పండి. అది ఏదైనా తీసుకోండి. అంతెందుకు ఈ సంవత్సరం 'ఎల్‌నినో' ప్రభావం వల్ల దేశంలో కొన్ని కోట్ల మంది రైతులు తమ వ్యవసాయ పద్ధతులు, సాంప్రదాయ విధానాలు మార్చుకొని నిత్యం పండించే పంటలు కాకుండా ప్రత్యామ్నాయ విధానాల వైపు మళ్ళారు. ఇది మీ అందరికి తెలిసిన విషయమే కదా.?


అలాంటప్పుడు మీ అకాడమిక్ నాన్ అకాడమిక్ పరీక్ష లు, పోటీ పరీక్షలు, వ్యాపారాలు, ఇతరత్రా ఏమైనా కావొచ్చు. అన్నీ మీకు అనుకూలంగా జరగాలని ఆశించ టం అత్యాశే అవుతుంది. కాదంటారా చెప్పండి? పంట వేసిన తెల్లారే చేతికి వస్తుందా? విత్తనం చల్లిన వారం రోజులకే పంట దిగుబడి చేతికి వస్తుందా దాని కాలం, ఏ పంట ఎన్ని రోజులకు దిగుబడి వస్తుంది. అనేది మీరు వేసిన పంటను బట్టి మీరు చూయించే శ్రద్ధను బట్టి (వరి మూడు, నాలుగు నెలలు) అది కోతకు రావాల్సిన సమయంలోనే వస్తుంది. అంతే తప్పా మీరు ఎన్ని ఖరీదైన మందులు వాడినా త్వరగా చేతికి రాదు. కాబట్టి మీరు నిర్ణయించుకునే మీ లక్ష్యాలు ఏవైనా కావొచ్చు ముందుగా మీ ముందున్న సాధ్యాసాధ్యాలు పరిశీలించండి. మీ ముందున్న అవకాశాలను అందిపుచ్చుకోండి. చింపాంజీలా కాకుండా మీ దరిదాపుల్లో ఉన్న అవకాశాలను ఉపయోగించుకొని ఎదగటానికి ప్రయత్నించండి. నిజానికి ఈ ప్రపంచంలో కర్షకుడికి (రైతు) మించిన ఆశాజీవి ఎవరైనా వున్నారా చెప్పండి. కానీ ఈసారి ప్రకృతి కరుణించలేదు. ఫలితంగా తన దృక్పథాన్ని మార్చుకున్నాడు. అంతే తేడా ప్రకృతి సహకరిస్తే మళ్ళీ తిరిగి తన ఆశలకు జీవం పోసి పంట పొలం వైపు దృష్టి కేంద్రీకరిస్తాడు. మీరూ అంతే. మీ దృష్టిని మార్చాల్సిందే. మీకు సాధ్యం కానీ పని ఏదైనా అనిపిస్తే వెంటనే దాని నుండి పక్కకు తప్పుకోండి. 'నదిని చూడండి తన ప్రవాహానికి ఏదైనా ఆటంకం వస్తే తన బలాన్నంతా కూడదీసుకొని నెట్టివేసే ప్రయత్నం చేస్తుంది. లేనిపక్షంలో పక్కకు దారి చేసుకొని వె ళ్ళుతుంది. ఎత్తైన కొండ అడ్డం వస్తే జలపాతమై కను విందు చేస్తూ క్రిందకు దూకి ప్రవహిస్తుంది. అంతే కానీ ఒకే చోట స్థిరంగా ఉండదు'. ప్రవహించే నీరు స్వచ్ఛంగా ఉంటుంది. ఒకేచోట నిలబడిన నీటికి ఫంగస్, వైరస్, బ్యాక్టీరియా చేరి దుర్గంధం వెదజల్లుతుంది. కాబట్టి స్వచ్ఛమైన నీటిలా ప్రవహించండి?

ఏం చేస్తే మీ జీవితం సంతోషంగా ఉంటుందనే అన్వేషణను మొదలు పెట్టండి. అంతేకాని ఇతరులను అనుకరించడానికి ఎట్టి పరిస్థితుల్లో ప్రయత్నించకండి. అది మిమ్మల్ని ఎల్లకాలం కాపాడలేదు. మీకు రాని విద్యలు ఇతరులకు అబ్బితే మీరు అనుకరించాలని ప్రయత్నం చేస్తే సాధ్యమవుతుందా చెప్పండి? మీకు ఏం వస్తుందో అందులోనే రాణించే ప్రయత్నం చేయండి. ఒకవేళ మీకు చదువుపట్ల అస్సలు శ్రద్ధ ఉండటం లేదు వెంటనే గుడ్ బై చెప్పండి. మీకు నచ్చిన రంగం ఎదో ఎంచుకోండి అందులో రాణించే ప్రయత్నం చేయండి. అంతే కానీ అబ్బని చదువును తరగతి గదిలో కూర్చొని విలువైన కాలాన్ని సంవత్సరాలుగా వృధా చేసేబదులు ఏ పని నేర్చుకున్నా అందులో మీరు అనుభవజ్ఞులు అవుతారు. కాదంటారా చెప్పండి. అందుకే 'నచ్చిన రంగంలో రానించండి.' నచ్చని వాటిని వదిలేయండి. అంతే కాని మానసిక ప్రశాంతతను దూరం చేసే వాటిని నేత్తికెత్తుకొని బాధపడటం కన్నా వాటిని వదిలేసి ప్రశాంతంగా ఉండటం ఉత్తమం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 16.10.2026
www.mudranews.in | @mudranews

తగినంత నీరు తాగండి

చలికాలంలో దాహం తక్కువగా అనిపించినా శరీరానికి అవసరమైనంత నీరు తాగడం ముఖ్యం. శరీరంలో నీటి లోపం రాకుండా చూసుకోవడంతో పాటు, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



ఘనంగా బతుకమ్మ వేడుకలు







హెచ్.ఏ.ఎల్.లో..

ముద్ర కూకట్‌పల్లి : హెచ్.ఏ.ఎల్. (హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్) బాలానగర్ పరిశ్రమలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకయిన బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హెచ్.ఏ.ఎల్. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గుర్తింపు పొందిన యూనియన్ సహకారంతో ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా పరిశ్రమలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ట్రైనీలు పూలతో పేర్చిన బతుకమ్మలను సౌత్ గేట్ వద్దకు తీసుకువచ్చి బతుకమ్మ పాటలు పాడి, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్.ఏ.ఎల్. జనరల్ మేనేజర్ మురళీకృష్ణ, ఎస్.ఎల్.ఆర్.డి.సి. జనరల్ మేనేజర్ సతీష్ హాజరై, తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు.ఈ వేడుకల్లో చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఉమా ఎన్. రావు, డి.జి.ఎం. విఠల్, యూనియన్ అధ్యక్షుడు వెంకట్రాద్రి, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుక రాందాసు, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజుతో పాటు గణేష్, రాంచందర్, క్రాంతి, సంతోష్, అనిల్, సుధీర్, కుతాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ ఈ ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో..

ముద్ర, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.సిఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం మరియు అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతమైంది.ఈ సంబరాలలో జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ తో పాటు యూసీడీ, యూబీడీ విభాగాల అధికారులు, మహిళా ఉద్యోగులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో జోనల్ కార్యాలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రగతి రిసార్ట్స్‌లో..

ముద్ర, చేవెళ్ల.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రగతి రిసార్ట్స్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి, విల్లా యజమానులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో సాగాయి. అందరూ కలిసి బతుకమ్మ పండుగను జరుపుకోవడంతో ప్రగతి రిసార్ట్స్ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విల్లా యజమానుల మధ్య ఆత్మీయత, ఐకమత్యం వెల్లివిరిశాయి.ఈ వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చిన సంస్థ చైర్మన్ డాక్టర్ జి.బి.కె. రావు, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ చంద్ర, ఫైనాన్స్ డైరెక్టర్ జి.వి. కుమారి, డైరెక్టర్ (పి అండ్ ఏ) ఎం. రామకృష్ణలకు ప్రగతి టీమ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవడం మధురమైన అనుభూతిని అందించిందని, ఈ సాంస్కృతిక వేడుక విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రగతి టీమ్ పేర్కొంది.

కమీషన్ల దందాకు అడ్డాగా సీఎం కార్యాలయం!

ప్రతి పనికీ 15 శాతం కమీషన్ డిమాండ్
కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. దోపిడీ పాలన
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 15: తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం కమీషన్ల దందాకు అడ్డాగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రతి పనికీ 15 శాతం కమీషన్ ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో దోపిడీ, లూటీ పాలన సాగిస్తోందని విమర్శించారు. గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఈ ఆరోపణలు చేశారు.తమ అనుచరులు, సన్నిహితులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చట్టాలను, నిబంధనలను పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. అర్హతలు లేనివారికి సైతం కమీషన్ల కోసమే పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంపైనే ఇలాంటి



ఆరోపణలు రావడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ సమాజం ఇటువంటి చర్యలను సహించబోదని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మహిళా రైతుల సాధికారతకు ప్రత్యేక చట్టం తేవాలి మహిళా రైతులకు చట్టపరమైన గుర్తింపు, సామాజిక భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా గురువారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆమె, వ్యవసాయ రంగంలో మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉదయం నుంచి రాత్రి వరకు వ్యవసాయం, పాడి పరిశ్రమ పనుల్లో మహిళలు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న మహిళా రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చినట్లు పేర్కొన్న మహిళా రైతుల సాధికారత చట్టం–2026 స్ఫూర్తితో తెలంగాణలోనూ ప్రత్యేక చట్టం రూపొందించాలని సూచించారు. మహిళా రైతులు, వ్యవసాయ కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వారి శ్రమను గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కవిత పేర్కొన్నారు.

సేవా సంకల్ప అభియాన్' రహదారి భద్రతపై అవగాహన

ముద్ర, కూకట్‌పల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. రహదారి నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రయాణికులకు, వాహనదారులకు చైతన్యం కలిగించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: ఆనంద్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్ హాజరయ్యారు.ఈ



సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, "ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. రహదారి భద్రత అనేది మనందరి సామాజిక బాధ్యత" అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సిగ్నళ్లను గౌరవిస్తూ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించడం వల్ల అమూల్యమైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలే 'సేవా సంకల్ప అభియాన్' లక్ష్యం: వడ్డేపల్లి రాజేశ్వరరావు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం మరియు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి విలువైన సందేశాన్ని అందించడమే 'సేవా సంకల్ప అభియాన్' ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా, ఇతరులలో కూడా చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

ఘనంగా అరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు

ముద్ర, శేరిలింగంపల్లి: పీయేసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద నగర్ లోని తన నివాసంలో తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్ పటేల్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో పాటు నాయకులు అరెకెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముద్ర, కూకట్‌పల్లి / శేరిలింగంపల్లి : ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మరియు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఎమ్మెల్యే కు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మహంకాళి నగర్‌లోని ఆశా నగర్‌లో ఉన్న వెంకటేష్ గౌడ్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో కలసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ముద్ర, శేరిలింగంపల్లి : పాపిరెడ్డి నగర్ కాంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజక







వర్గంలో పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే గాంధీ సేవలను కొనియాడారు. ప్రజల అవసరాలకు తగినట్లుగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకులు ఈ. రెడ్డి దేవేందర్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, ఎర్ర సంపత్ రెడ్డి, డాకురి అక్కిరెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

9వ ఫేజ్ నూతన కార్యవర్గాన్ని అభినందించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేశ్

ముద్ర, కూకట్‌పల్లి:



కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గాభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఆయనకు పరిచయమై, కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, మౌలిక సదుపాయాల అవసరాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కాలనీల పురోగతిలో సంక్షేమ సంఘాల పాత్ర అత్యంత కీలకమని, సీనియర్ సిటిజన్ల అనుభవం, మార్గదర్శకత్వంలో యువత భాగస్వామ్యంతో ముందుకు సాగాలని సూచించారు.రాజకీయాలకు అతీతంగా కాలనీ వాసులందరూ ఐకమత్యంతో పనిచేస్తూ, కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌ను పరిశుభ్రమైన, సురక్షితమైన ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు జి. రామకృష్ణారెడ్డి, కె. రాహుల్, కె. చంద్ర మోహన్ రెడ్డి, ఎం. వీర గోవిందరావు, ఎన్. తిలక్ కుమార్, కృష్ణార్జున రెడ్డి, ఈశ్వర రెడ్డి, పి.వి. సత్యనారాయణ, యాదిరెడ్డి, వై. వెంకటరత్నం, విజయ్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ రాజు, మధుసూదన్ రెడ్డి, చారి, నందయ్య, బాబూరావు, బి. వెంకటేశ్వరరావు, కిల్లారు శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలకు ఆహ్వానం



ముద్ర కూకట్‌పల్లి/శేరిలింగంపల్లి : తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో శుక్రవారం బతుకమ్మ సంబురాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డిసిసి నాయకులు పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారు.తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ వేడుకల్లో మహిళా సోదరి మణులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని, పూలతో బతుకమ్మను కొలిచి పండుగను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కెపిహెచ్‌బిలో ఆర్ఎస్ఎస్ నగర కార్యాలయం ప్రారంభం



ముద్ర, కూకట్‌పల్లి : కెపిహెచ్‌బి కాలనీ 4వ ఫేజ్, ఎల్ఐజీ బ్లాక్ నెంబర్ 79/4లో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ కెపిహెచ్‌బి నగర కార్యాలయం 'మధుకర్ నిలయం' ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యాలయం ద్వారా పేద విద్యార్థులకు 'అభ్యాసిక' పేరిట ఉచితంగా ట్యూషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు సాహిత్యంపై ఆసక్తి ఉన్న పిల్లలకు మెలుకువలు నేర్పించడంతో పాటు, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చింత వైకుంఠం, చింతా రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, ఓబయ్య, మురళీధర్, రమేష్, రఘువీర్, శ్రీనివాస్, నన్నపనేని రాజశేఖర్, అయ్యన్న, కట్టా నరసింగరావు, వరలక్ష్మి, కామేశ్వరరావు, ప్రీతం రెడ్డి, మహేష్, సూరి హరిబాబు, గంధం రాజు, వెంకటేశ్వర రెడ్డి, కుమార్, మహేందర్, రేవతి, నాగలక్ష్మి, సులోచన, అనూష, శిరీష, లావణ్య, స్వర్ణ, తోట రమేష్, శ్రీనివాసరాజు, యాదవ రెడ్డి, కన్నబాబు, శేఖర్ రెడ్డి, రాకేష్ రెడ్డి, ప్రభాకర్, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు మరియు వివిధ క్షేత్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

శివ శంకర్ మాదిగ కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ

ముద్ర, చేవెళ్ల: ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం జరిగింది. గురువారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలంలోని టంగటూరు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి శివశంకర్ మాదిగ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.శివశంకర్ మాదిగ కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆయన మృతికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి భరోసా కల్పిస్తూ ధైర్యం చెప్పారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో క్రియాశీలకంగా కష్టపడ్డ శివశంకర్ మాదిగ మృతి చెందడం చేవెళ్ల ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా మాజీ అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, ఎం ఆర్ పి ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కాడిగాళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, శంకర్ పల్లి మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్: పేదల అభివృద్ధి, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు లబ్ధి అందించడంలో తమ మకిలిస్ పార్టీ ప్రజాసేవలో ముందుంటుందని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు.ఆసిఫ్ నగర్ మండలం పరిధిలోని అర్హులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన గురువారం అందించారు.ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సాహెబ్ ఆదేశాల మేరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఏఐఎంఐఎం కార్వాన్ దారుస్సలాంలోని ఏఐఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆసిఫ్ నగర్ మండలం లబ్ధిదారులకు 19 షాదీ ముబారక్ మరియు 57 కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశామన్నారు. పంపిణీ చేసిన మొత్తం చెక్కుల విలువ రూ. 7,608,816/– డెబ్భై ఆరు లక్షల ఎనిమిది వేల 16 రూపాయలు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.ఒక్కో చెక్కు విలువ రూ. 1,00,116/– అన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో ఆసిఫ్ నగర్ మండలం సిబ్బంది, ఏఐఎంఐఎం ప్రాథమిక యూనిట్ అధ్యక్షుడు మరియు క్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 16.10.2026
www.mudranews.in | @mudranews

నొప్పులు ఎక్కువైతే వైద్యులను సంప్రదించండి

కీళ్ల వద్ద వాపు, తీవ్రమైన నొప్పి, ఉదయం ఎక్కువసేపు కీళ్లు పట్టుకు పోవడం లేదా నడవడానికి ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. వాతావరణ మార్పులే కారణమని భావించకుండా వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు, చికిత్స తీసుకోవాలి.



రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రపెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు



ముద్ర, నేరేడుచర్ల : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు, గురువారం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని స్పందన, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్ రెడ్డి తో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి, పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులను వరదలగా తీసుకొస్తున్న విషయాన్ని గుర్తు చేశారు, అన్ని వర్గాలను కలుపుకొని సమన్వయంతో రాజకీయం చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని అన్నారు, సుదీర్ఘ కాలంగా రాజకీయాలు కొనసాగిస్తున్న వారికి పదవులు లభిస్తాయి అన్నారు, పార్టీ అభివృద్ధికి పని చేస్తున్న వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు, గోదాముల నిర్మాణం చేపట్టి రైతుల అవసరాలను తీర్చాలని అన్నారు, ప్రభుత్వం ఇటీవలనే మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులకు 260 కోట్ల రూపాయలు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు, నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన రంగినేని స్పందన రాజీవ్ మాట్లాడుతూ తాను విదేశాలలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నప్పటికీ రైతులకు, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాలలో ప్రవేశించానన్నారు, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు, నూతన పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల ప్రజా ప్రతినిధులకు, మాజీ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు, డైరెక్టర్లుగా కర్ణం రామ నరసయ్య, బుర్రి వెంకయ్య, సూరోజు రవీంద్ర చారి, ఊటుకూరు సైదులు,పల్లె కాశయ్య, కత్తి శ్రీనివాసరెడ్డి, ధనావత్ సైదులు, రమావత్ వశ్య నాయక్ , చింతలచెరువు ప్రియాంక, పోతురాజు జ్యోతి ,రెబ్బ రమేష్ , పోలా విశ్వనాథం మున్సిపాలిటీ చైర్మన్ మున్సిపాలిటీ నేరేడుచర్ల కొనతం వెంకట్ రెడ్డిలు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు, మొదట స్థానిక ప్రధాన కూడలి నుండి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు చైర్మన్ రంగనేని స్పందన రాజీవ్ లతోపాటు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం చైర్మన్ దంపతులకు గజమాల వేశారు ,హుజూర్నగర్ మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ హుజూర్నగర్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నేరేడుచర్ల హుజూర్నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, కోతి సంపత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాముల శివారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, అరుణ్ కుమార్ దేశముఖ్, పాలకవీడు మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, మాజీ జెడ్పిటిసి మాలోత్ మోతిలాల్ నాయక్, బెల్లంకొండ నరసింహారావు,మాజీ వ్యవసాయమార్కెట్ కమిటీ నేరేడుచర్ల వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మాజీ సహకార సంఘం చైర్మన్ చలసాని శ్రీనివాస్, కౌన్సిలర్లు కొణతం మంజుల, లక్ష్మి శ్రీనివాస్ , ఇంజమూరిశ్రీకాంత్, నన్నెపంగా శ్రీను, కొ ఆప్షన్ సభ్యులు శ్రవణ్ రెడ్డి, షేక్ మొగలాబి,మాజీ మున్సిపల్ చైర్మన్ నేరేడుచర్ల బచ్చలకూరి ప్రకాష్, నేరేడుచర్ల, పాలక వీడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు, పాలక వీడు , సర్పంచుల ఫోరం అధ్యక్షులు రహీముద్దీన్ ,నీమ, గరిడేపల్లిమాజీ ఎంపీపీ గరిడేపల్లి పెండెమ్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట రామారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లంశట్ల రమేష్ బాబు, సర్పంచులు పారేపల్లి సత్యనారాయణ, చిన్న వెంకన్న, వల్లంశట్ల, వల్లంశెట్లలచ్చయ్య, రాచకొండఅజయ్ కుమార్, రణపంగ నాగయ్య తదితరులు పాల్గొన్నారు,

కీసరలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఎంఆర్వో, ఇద్దరు రెవెన్యూ సిబ్బంది



ముద్ర, మేడ్చల్: భూ సక్సెషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి లంచం డిమాండ్ చేసిన కీసర తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సర్వే నంబర్ 183, 184 పరిధిలోని 3 ఎకరాల భూమికి సంబంధించి సక్సెషన్ వ్యవహారం పరిష్కరించేందుకు అధికారులు మొత్తం ₹5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా తొలి విడతగా ₹2.50 లక్షలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో డిప్యూటీ ఎంఆర్వో సందీప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణలను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

ఘట్కేసర్ సీఐ బాలస్వామి సస్పెన్షన్

అవినీతి, సివిల్ వివాదాల్లో జోక్యంపై కమిషనరేట్ కొరడా

ముద్ర, హైదరాబాద్ : పోలీస్ శాఖలో అవినీతి అక్రమాలు, సివిల్ వివాదాల్లో అనధికార జోక్యంపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఘట్కేసర్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎం. బాలస్వామిపై వచ్చిన తీవ్రమైన అవినీతి ఆరోపణలు విచారణలో రుజువు కావడంతో ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేస్తూ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఓ భూ వివాదంలో సీఐ బాలస్వామి అక్రమంగా జోక్యం చేసుకోవడమే కాకుండా, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పెషల్ బ్రాంచ్ (SB) అధికారులు సమగ్ర శాఖాపరమైన విచారణ చేపట్టారు. విచారణ నివేదికలో సివిల్ వ్యవహారాల్లో ఆయన అనుచిత జోక్యం, విధి నిర్వహణలో అవినీతి నిజమేనని స్పష్టం కావడంతో ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

దసరా వేళ పునరావృతమైన సెంటిమెంట్:

గతంలోనూ ఘట్కేసర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి దసరా పండుగ సమయంలోనే సస్పెన్షన్‌కు గురైన ఘటనలు ఉండగా, సరిగ్గా మళ్లీ అదే పండుగ సీజన్‌లో ప్రస్తుత సీఐ కూడా సస్పెండ్ కావడం పోలీసు వర్గాల్లోనూ, స్థానికంగానూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శాఖ ప్రతిష్టను దిగజార్చేలా సివిల్ పంచాయితీలు చేసే వారిపై ఉపేక్షించేది లేదని అధికారులు ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు.

క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

ఖేలో తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
తొమ్మిది మందికి ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరిన మంత్రి



ముద్ర, హైదరాబాద్: క్రీడా మైదానాల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు నవీన్ కుమార్ యాదవ్ విసిరిన ఫిట్‌నెస్ ఛాలెంజ్‌ను స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, గురువారం 'ఖేలో తెలంగాణ బంధన్' కార్యక్రమంలో భాగంగా ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాలు నడక, పరుగు, సైక్లింగ్, యోగా లేదా తమకు అనువైన శారీరక వ్యాయామం కోసం సమయం కేటాయించాలని సూచించారు. శారీరక దృఢత్వం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ, సామాజిక శ్రేయస్సుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తమ వ్యాయామానికి సంబంధించిన 27 సెకన్ల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని, తొమ్మిది మంది మిత్రులను ట్యాగ్ చేయడంతోపాటు మరో తొమ్మిది మందిని ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాలని కోరారు. ఈ విధంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములైతే ఫిట్‌నెస్ ఉద్యమం ప్రజల్లోకి విస్తృతంగా చేరుతుందని అన్నారు.

ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్

ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయడంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ కార్యదర్శి, టీఎస్ఆర్‌టీసీ ఎండీ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌లకు ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు.

క్రీడలు కేవలం పోటీలు, పతకాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో, ప్రతి విద్యాసంస్థలో క్రీడా సంస్కృతి పెంపొందాలని మంత్రి ఆకాంక్షించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శారీరక వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు.

బీసీ విద్యాసంస్థల్లో ఫిట్‌నెస్ కార్యక్రమాల విస్తరణ

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్ని విద్యాసంస్థల్లో ఖేలో తెలంగాణ బంధన్, ఫిట్‌నెస్ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేసే దిశగా చర్యలు చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమిచ్చేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు కన్నం మధు, సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్, భట్టి ఫెయిల్ అయ్యారు

- హరీశ్‌రావు

ముద్ర, సిద్దిపేట టౌన్: ''బొగ్గు ఉత్పత్తి లేక విద్యుత్తు నిలిచిపోతోంది. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నా.. మోటార్లు నడపకపోవడంతో నీళ్లు వస్తలేవు. రాష్ట్రంలో మూడు నెలల నుంచి రైతు బీమా పథకం ఆగిపోయింది. వేలాది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీనికి కారణం మీ ప్రభుత్వం కాదా?'' అని రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట నియోజకవర్గంలో రైతు బీమా సొమ్ము అందని కుటుంబాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశమై మాట్లాడారు.

''ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క ఫెయిల్ అయ్యారు. తప్పులన్నీ మీరు చేసి విద్యుత్తు అధికారులను సస్పెండ్ చేస్తామనడం ఏంటి? ముందుగా మిమ్మల్ని సస్పెండ్ చేయాలి. బీమా సొమ్ము అందక రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రభుత్వం మొద్దునిద్ర నుంచి లేచి ప్రజల బాధలను అర్థం చేసుకోవాలి. లేదంటే అదే రైతు కుటుంబాలతో సీఎం ఇంటి ముందు ధర్నా.. సచివాలయం ముట్టడి నిర్వహిస్తాం'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన వేములవాడ రూరల్ తహసీల్దార్

ముద్ర, వేములవాడ గ్రామీణం: వ్యవసా య భూమిని గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసి, రూ.8 వేలు తీసుకుంటూ వేములవాడ రూరల్ తహసీల్దార్–జాయింట్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ అబూబకర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆయనతోపాటు ప్రైవేటు భూ భారతి ఆపరేటర్ సంకసాల అనిల్ కుమార్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి అత్తకు చెందిన చెక్కపల్లిలోని వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరిట గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియలో సహకరించేందుకు తహసీల్దార్ అబూబకర్ రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ప్రైవేటు ఆపరేటర్ అనిల్ కుమార్ ద్వారా తహసీల్దార్ అబూబకర్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులిద్దరినీ కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డారన్న విషయం తెలుసుకున్న పలువురు బాధితులు కార్యాలయం ఎదుట టపాసులు పేల్చారు.

కొత్తగట్టు టోల్ ప్లాజా ప్రారంభం..



ముద్ర శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద 563వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజాను గురువారం ఉదయం నిర్వాహకులు అధికారికంగా ప్రారంభించారు. ఈ టోల్ ప్లాజా పరిధి గుండా వాహనాలు దాదాపు 65 కిలోమీటర్ల మేర రాకపోకలు సాగించనున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇకపై నిర్దేశిత టోల్ రుసుం చెల్లించి ప్రయాణించాల్సి ఉంటుంది.

టీయూడబ్ల్యూజే ఖండనతో పోలీస్ శాఖలో చర్యలు

గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్
రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై విచారణ
మిగిలిన ఇద్దరు కానిస్టేబుళ్లపై కొనసాగుతున్న శాఖాపరమైన విచారణ



ముద్ర, గంభీరావుపేట : గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రసారం చేసినందుకు ఏక్ దమ్ న్యూస్ రిపోర్టర్లు సంపత్, శేఖర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలను టీయూడబ్ల్యూజే (IJU) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై జర్నలిస్టు సంఘం స్పందించి ఖండన వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీస్ శాఖ శాఖాపరమైన చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఎస్సై శ్రీకాంత్‌ను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. అలాగే ఈ ఘటనకు సంబంధించి మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. జర్నలిస్టులపై దాడులు, వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు కోరుతున్నాయి.

సింగరేణి ప్రైవేటీకరణ అవాస్తవం: మంత్రి లక్ష్మణ్



ముద్ర, ధర్మపురి : బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులు మరణిస్తే ఏ ఒక్క కుటుంబాన్ని పరామర్శించని ఆ పార్టీ కార్యనిర్వాహణాధికారి కేటీఆర్.. ఇప్పుడు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో జిల్లా పాలనాధికారి సత్యప్రసాద్‌తో కలిసి పల్లె దవాఖాన, చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను ప్రైవేటీకరిస్తోందని కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డ్రైనేజీల వద్దకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుండటంతోనే కేటీఆర్ ప్రజాప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి వెంట జిల్లా వైద్యాధికారిణి సుజాత, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ తదితరులు ఉన్నారు.

నీరు, విద్యుత్ కొరత తప్పదు.. యాసంగిలో వరి సాగు వద్దు

- సీఎం రేవంత్



ముద్ర, హైదరాబాద్: ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

వరి సాగు వాయిదా వేసుకోండి..

''గతేడాది ఈ సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకుపైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీళ్లనే పొదుపుగా వాడుకోవాలి. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకం. మళ్లీ వర్షాలు వచ్చేవరకు అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. హైదరాబాద్‌కు నీరందించే జలాశయాలూ ఎండిపోతున్నాయి. రైతులు పెద్దమనసు చేసుకుని.. ఒక వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. యాసంగిలో వరి పంట వేయొద్దు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

కేంద్రం ఆదుకోవాలి..

ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. సగటుపై అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. అక్టోబరులో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు. మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి. కేంద్ర–రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి.


విపక్షాలు కలిసి రావాలి..

సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కేంద్రం నుంచి అధిక నిధులు పొందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించాం. విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలి. ప్రకృతి విపత్తును జయించేందుకు అందరి సహకారం కావాలి. దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 16.10.2026
www.mudranews.in | @mudranews

పోషకాహారానికి ప్రాధాన్యమివ్వండి

కీళ్ల ఆరోగ్యానికి కాల్షియం, విటమిన్-డి వంటి పోషకాలు అవసరం. పాలు, పెరుగు, ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలి. విటమిన్-డి లోపం ఉందనే అనుమానం ఉంటే వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవాలి.



ఘనంగా బతుకమ్మ సంబరాలు

గౌరీమాతకు పూజలు
నిర్వహించిన స్థానిక సంస్థ ల
అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : బతుకమ్మ పండుగను పురస్కరించుకుని (కలెక్టరేట్)లో టీఎన్జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, వివిధ జిల్లాల శాఖల అధికారులు ,తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ



ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఉత్తమ అలంకరణతో కూడిన బతుకమ్మలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు.ఈ ఉత్సవాల్లో జెడ్పి సీఈవో శోభారాణి,జేఏసీ చైర్మన్లె మందడి ఉపేందర్ రెడ్డి ,డిప్యూటీ సీఈవో శ్రీనివాస్,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రమణారెడ్డి,కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి,






టీజీవో జిల్లా అధ్యక్షులు భగత్ ,రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, పాల్గొన్నారు.

కోలాహలంగా బతుకమ్మ వేడుకలు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 15: తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు నగరంలోని 14, 15వ డివిజన్లలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా "అట్ల బతుకమ్మ" వేడుకలను జరుపుకున్నారు. ఉదయాన్నే రంగురంగుల పూలను సేకరించి అంద మైన గౌరమ్మను తయారు చేసిన మహి ళలు, సాయంత్రం సిపిఐ శాఖ కార్యాలయం వద్ద బతుక మ్మలను ఉంచి సామూహికంగా ఆటపా టలతో సందడి చేశారు. చప్పట్లు, కోలాటాలు, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా, పరస్పర ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు అద్భుతంగా సాగాయని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బతుకమ్మలను సాంప్రదాయ బద్ధంగా నీటిలో నిమజ్జనం చేశారు. ఈ



సంబరాల్లో పలువురు నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో..

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా బతుకమ్మ వేడుకలు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బతు కమ్మలతో పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి ఆటపాటలతో ప్రాంగణాన్ని పండుగ శోభతో నింపేశారు. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.బతుకమ్మలతో వచ్చిన ప్రతి ఒక్క మహిళకు నాయకులు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు, వారి కుటుంబ సభ్యులు, కార్యక ర్తలందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకలకు మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ, బోనకల్, చింతకాని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు సహా నగర నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు

ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం కార్యాలయంలో గురువారం కౌన్సిల్ హాలులో చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఏజెండా అంశాలలో పొందుపర్చిన మొత్తం 6 అంశాలు ప్రవేశపెట్టగా చర్చించి అంశా లన్నింటిని ఆమోదించారు. అంశాలలో వివిధ వార్డులలో అభివృద్ధి, నిర్వహణ పనులు చేపట్టుటకు అగు వ్యయం రూ.10.80 లక్షలు ఆమోదించి, పురపాలక సంఘ సాధారణ నిధులు రూ. 1.50 లక్షలతో భువనగిరి పురపాలక సంఘంలోని వార్డు నెం. 30లో గల పహాడినగర్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం చేపట్టు పనిని మార్చుట, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పండుగల నిర్వహణ కొరకు అత్యవసరంగా వివిధ ఏర్పాట్లు చేయించి నందుకు అయిన వ్యయం రూ.5.50 లక్షలు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి వెచ్చించుట, వివిధ పథకాల ద్వారా చేపట్టబడు అభివృద్ధి పనుల నాణ్యత ప్రమాణాల నిర్వహణ కొరకు 3వ పార్టీ క్వాలిటి కంట్రోల్ పరీక్షలు చేయుటకు ఏజెన్సీని నియమించుట కొరకు ఆసక్తి



వ్యక్తికరణ (ఈ .ఓ .ఐ .) కోరుట, వివిధ పథకముల ద్వారా చేపట్టబడు అభివృద్ధి పనుల యొక్క నాణ్యత ప్రమాణాల నిర్వహణ కొరకు 3వ పార్టీ క్వాలిటి కంట్రోల్ పరీక్షలు చేయుటకు గతంలో ఎంగేజ్ చేసుకున్న ఏజెన్సీ అగు మెస్సర్స్ డెసిబుల్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ సర్వీసెస్, నల్లగొండ వారి యొక్క కాలపరిమితిని తేది 30.11.2026 వరకు కొనసాగించుటకు ఆమోదించడం జరిగిందని తెలిపారుద. వార్డు సభ్యులు తమ తమ వార్డులోని పలు సమస్యలు తెలియజేసి సదరు చేపట్టవలసిన పనులపై తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల, మున్సిపల్ కమీషనర్ కె. చంద్రప్రకాష్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ఆలోచనలతో కొత్త రాజకీయ పార్టీ

పిఆర్కే రాజకీయ పార్టీని ప్రకటించిన ప్రవీణ్ కుమార్ రెడ్డి 9 ఏళ్లుగా ప్రజాసేవలో ఉంటూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి..



ముద్ర, యాదగిరిగుట్ట: తొమ్మిదేళ్లుగా హనుమాన్ ఎడ్యుకేషన్ అండ్ హాస్పిటల్ సర్వీసెస్ పేరుతో పేద ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు ఉచిత వైద్య సేవలను అందిస్తున్న సామాజిక వేత్త అన్నం ప్రవీణ్ కుమార్ రెడ్డి గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో పీఆర్కే పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. ముందుగా యాదగిరిగుట్ట పట్టణంలో ర్యాలీగా వెళ్లి వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ సంస్థ తరపున గత తొమ్మిదేళ్లుగా పేద ప్రజలకు నిరంతరం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని, కానీ ప్రజలకు మరింత చేరువ అయి సంపూర్ణంగా సేవలు అందించ డానికి మరింత శక్తి కావాలనే ఉద్దేశంతో కొత్త ఆలోచనలతో రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2018 లో తమ తల్లిదండ్రులకు గుర్తుగా హైదరాబాదులోని అమీన్పూర్ లో మొదటగా అన్నం కార్డులు పంపిణీ చేశామని, అందులో పేదలకు బియ్యం, ఉప్పు, పప్పు లాంటి సరుకులు పంచామని తెలిపారు. దానితో పాటు పలు మెడికల్ కాలేజీల ద్వారా మెడికల్ క్యాంపులు పెట్టి, వైద్య సహాయం అందించామన్నారు. అదేవిధంగా పేద పిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం చేశామని పేర్కొన్నారు. అదే సేవా స్ఫూర్తితో ప్రోగ్రెసివ్, రీఫార్మ్, నాలెడ్జ్ (PRK) పేరుతో విభిన్న ఆలోచనలతో నూతన రాజకీయ పార్టీని స్థాపించి ప్రజలకు మరింత చేరువ అవుతామని అన్నారు. ప్రజాసేవలో ఇప్పటివరకు ప్రజలు ఎలా సహకరించారో ఇపుడు కూడా అలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నానని, రాజకీయాల్లోకి వచ్చినా ప్రజా సేవ కొనసా గుతుందని పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

డిసిసి అధ్యక్షుడు
నూతి సత్యనారాయణ గౌడ్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 15 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యములో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపు నిచ్చారు. డిసిసి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ నియోజ కవర్గ ఇంచార్జీలు, కాంగ్రెస్ ముఖ్య నేతలు బాలసాని లక్ష్మి నారాయణ, పోట్ల నాగేశ్వ రరావు, రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, వేమిరెడ్డి శ్రీనివాసరె డ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో స్థానిక ఎమ్మెల్యేల అనుమతితో నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. మండలాల వారీగా పాత కమిటీలను పరిశీలించి



నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ, బూత్ స్థాయి కమిటీల ద్వారా సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు. బిఎల్ఎ ల ద్వారా ఎలక్టోరల్ పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాల ని, ప్రతి మండలంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారి కోసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను సమీక్షించాలని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేల కో-ఆర్డినేషన్‌లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి పట్టభద్రుడికి వివరించి, వారిని ఓటర్లుగా నమోదు చేసేలా కృషి చేయాలని కోరారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన రోటరీ సభ్యులకు సన్మానం



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఎన్నికల్లో విజయం సాధించిన రోటరీ సభ్యులను రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో సన్మానిం చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ మాజీ అధ్యక్షు లు సద్ది వెంకట్ రెడ్డి చైర్మన్‌గా, మాజీ అధ్యక్షులు దిడ్డి బాలాజీ వైస్ చైర్మన్‌గా, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షులు ఎంఎ రహీం కోశాధికారిగా, డాక్టర్ ఎడ్ల అనిల్ కుమార్ రెడ్డి డైరెక్టర్‌గా, ఇన్నర్ వీల్ సభ్యురాలు ఇటిక్యాల లావణ్య డైరెక్టర్‌గా విజయం సాధించిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పకీర్ కొండల్ రెడ్డి, కాకతీయ రీజియన్ మెంబర్‌షిప్ చైర్మన్ డాక్టర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి అధ్యక్షులు కూచిపట్ల సత్యనా రాయణ రెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు శెట్టి బాలయ్య యాదవ్ పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భువనగిరి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేఖ బాబు రావు అన్నారు. గురువారం మండలంలోని బోల్లేపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో కార్యక్రమంలో ఆమె పాల్గొని



మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. బొల్లేపల్లి గ్రామ అభివృద్ధి కోసం దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులు ఇచ్చిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ సర్పంచ్ రమాదేవి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ గడ్డమీ వీరస్వామి గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏ సి ఎస్ డైరెక్టర్ పాపమ్మ శంకరయ్య, వార్డ్ మెంబర్ సందెల మహేష్, వదిచర్ల కీర్తన సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు కృష్ణ గౌడ్, భువనగిరి మండల కార్యదర్శి నల్లొండ ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కనకుంట్ల కొండల్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముక్కిడి బాలయ్య,గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కనుకుంట్ల సురేష్,ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, కోశాధికారి బాలకృష్ణ, కార్యదర్శి యార్వ జంపయ్య భువనగిరి పాండు, గడ్డం జంగ య్య, హరి శంకర్ పాల్గొన్నారు.

వట్టిమర్తి క్రికెట్ ప్రీమియర్ లీగ్–3

ముద్ర, చిట్యాల : పట్టిమర్తి గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్–3 ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా కార్యక్రమం ఎలాంటి రాజకీయ పార్టీకి అతీతంగా గ్రామ ఐకమత్యాన్ని చాటిచెప్పే



విధంగా కొనసాగుతోంది. ముఖ్యంగా నేటి యువత మాదకద్రవ్యాలు, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలు, యువకులు, పూర్వ విద్యార్థులు, క్రీడాభిమానులు అందరూ సహకరించాలని కోరారు. "క్రీడలే మన బలం – ఐకమత్యమే మన గెలుపు – వ్యసనాలకు దూరంగా, క్రీడలకు దగ్గరగా" అనే సందేశంతో వట్టిమర్తి క్రికెట్ ప్రీమియర్ లీగ్–3 విజయవంతం కావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

పోలీసులు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్,15 : విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీస్ సిబ్బంది కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్



అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షల ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కంటి చూపు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స పొందడం ద్వారా భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను అరికట్ట వచ్చని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం శాఖ తరపున నిరంతరం అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో నిపుణులైన వైద్య బృందం పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కంటి చూపు సమస్యలు ఉన్నవారు వైద్యుల మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చికిత్స తీసుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు సర్వయ్య, సుశీల్ సింగ్, డాక్టర్ పాశం మహేష్, ఆర్ఐలు కామరాజు, సురేష్, శ్రీశైలం, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి
ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

ముద్ర, దేవరకొండ: త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ఇప్పటి నుంచే



సమన్వయంతో కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇచ్చిన సూచనలు, ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన పట్టభ ద్రులను గుర్తించి, వారు ఫారం–18 ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానంపై పట్టభద్రులకు వివరించి, ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని అన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. మండల అధ్యక్షులు కాసర్ల వెంకటేశ్వర్లు, మావిళ్ళ లక్ష్మీనా రాయణ, కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 15: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆటోమోటివ్ సర్వీస్ అడ్వైజర్ విభాగంలో 30 ఖాళీలు, ఆటోమోటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో 30 ఖాళీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు 19 నుండి 28 సంవత్సరాల వయస్సు ఉండి ఏదైనా డిగ్రీ, బీటెక్, బిఈ, డిప్లొమా లేదా ఇంటర్ ఉత్తీర్ణులైన స్త్రీ, పురుషులు అర్హులని వివరించారు. వీటితో పాటు ఆటోమోటివ్ స్పేర్స్ పిక్కర్ విభాగంలో 15 ఖాళీలు (ఐటీఐ లేదా ఇంటర్), టెలి కాలర్ ఎగ్జిక్యూటివ్స్ విభాగంలో 15 ఖాళీలు (ఇంటర్ లేదా డిగ్రీ), యాక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్స్ విభాగంలో 10 ఖాళీలు (ఎస్ఎస్సి లేదా ఐటీఐ) ఖాళీగా ఉన్నాయని తెలిపారు.శిక్షణ అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15 వేల నుండి రూ. 18 వేల వరకు వేతనం అందుతుందని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని అధికారిణి తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కోర్సు వివరాలు, శిక్షణ వ్యవధి తెలుసుకోవడానికి తమ విద్యార్హతల ధృవీకరణ పత్రాలతో ఈ నెల 17న ఖమ్మం ముస్తాఫానగర్‌లోని వివిసి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నేరుగా హాజరుకావాలని కోరారు. ఇతర సమాచారం కోసం హెచ్ఆర్ ఫోన్ నంబర్లు 7729992061, 926260743 లలో సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 16.10.2026
www.mudranews.in | @mudranews

శరీరాన్ని వెచ్చగా ఉంచుకోండి

చల్లటి వాతావరణంలో కీళ్లు, కండరాలు బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. అందుకే వెచ్చని దుస్తులు ధరించడం, మోకాళ్లు, భుజాలు వంటి భాగాలను చలి నుంచి రక్షించుకోవడం ద్వారా నొప్పుల తీవ్రతను తగ్గించుకోవచ్చు.



వనదుర్గమ్మకు బోనాలు

బోనమెత్తిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ

ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయలలోదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం శ్రీ మహాలక్ష్మీ (స్కందమాత) దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 బోనాల ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ వీరేశం ఆధ్వర్యంలో గోకుల్ షెడ్ వద్ద ఉత్సవ మూర్తి ముందు బోనాలు సిద్ధం చేసి ఆలయం వరకు ప్రత్యేక పూజల అనంతరం ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డితోపాటు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జెడ్పి మాజీ చైర్ పర్సన్ తుల ఉమా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళ నేతలు సైతం బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పద్మ దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించే జ్ఞానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



విద్యుత్ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు

ఆడిపాడిన మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక





ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఎస్ఈ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతిబింబించాయి. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూల సోయగాలు.. బతుకమ్మ పాటల సందడి.. ఆడపడుచుల కోలాహలం.. చప్పట్ల లయతో మెదక్ విద్యుత్ శాఖ కార్యాలయం పూలవనాన్ని తలపించింది. ఎస్ఈ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను మహిళా ఉద్యోగులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. డిటి శ్రీనివాస్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, మార్కయ్య, ఏడీ, ఏఈ, జేఏవో వేణు, సబ్ ఇంజినీర్లు, లైన్ ఇన్స్పెక్టర్ సంగయ్యతో పాటు విద్యుత్ శాఖ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయం వేదిక కావాలి

ములకలపల్లి–గొల్లగూడెం బీటీ రోడ్డు పనులు ప్రారంభం

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముద్ర, తుర్కపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వేదికగా నిలవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ములకలపల్లి నుంచి గొల్లగూడెం గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టడంతోపాటు, తుర్కపల్లిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.ప్రజలకు అందుబాటులో కాంగ్రెస్ కార్యాలయంతుర్కపల్లి మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే కేంద్రంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయం పెంపొందించేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని పేర్కొన్నారు.ములకలపల్లి–గొల్లగూడెం బీటీ రోడ్డు పనులు ప్రారంభంతుర్కపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామం నుంచి గొల్లగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. బతుకమ్మ సంబరాల్లో విప్ సందడితుర్కపల్లి మండల కేంద్రంలోని రంగా ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యత రగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో రేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు సాగునీరు అందాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని బతుకమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమాల్లో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, తుర్కపల్లి సర్పంచ్ సోమల వెంకటేశం, ములకలపల్లి సర్పంచ్ బానోతు బులి వీరన్న నాయక్, తహసీల్దార్ రవికుమార్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలగల రాజయ్య, బాల మల్లు యాదవ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష

22 న కలెక్టరేట్ ముట్టడికి విపక్షాల పిలుపు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 15 : ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం తీవ్ర రాజకీయ వివక్ష చూపుతోందని, అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న కార్యకర్తలకే ప్రాధాన్యం ఇస్తూ జాబితాలు తయారు చేస్తున్నారని, ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను అధికారులు సైతం గాలికి వదిలేశారని ఆరోపించాయి. రాజకీయ జోక్యం లేకుండా గ్రామాల్లో సేకరించిన దరఖాస్తుదారులం దరితో జాబితా రూపొందించి, లాటరీ పద్ధతి ద్వారానే పార దర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని విపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన విపక్షాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన అనర్హుల జాబితానే అధికారులు యథాతథంగా ఆమోదిస్తున్నారని, క్షేత్రస్థాయిలో నిజమైన పేదలు తీవ్ర అన్యాయానికి గురవు తున్నారని నేతలు మండిపడ్డారు.ప్రభుత్వం ఇప్పటికైనా తన తీరు మార్చుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతి నిధులు, ఇతర రాజకీయ పక్షాలను కలుపుకొని ఈ ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతి నిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ నెల 22న జరిగే కలెక్టరేట్ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విపక్ష నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకటవీరయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వ రరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి నీవై పుల్లయ్యతో పాటు వివిధ పక్షాల నాయకులు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచందర్రావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 15: రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో శాఖల మధ్య సమన్వయంతో పక్కా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ముగిసిన కొద్దిరోజులకే కొన్ని మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరేడుచర్ల, నూతనకల్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంత గిరి, తుంగతుర్తి, మేళ్లచెర్వు మండలాల్లో పరిస్థితి సాధారణంగానే ఉన్నప్పటికీ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సూర్యాపేట, చివ్వెంల, మునగాల, గరిడేపల్లి, పెన్‌పహాడ్, మోతె, చిట్యాల, కోదాడ తదితర మండలాల్లో పంటల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థ వంతమైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.తాగునీటి సరఫరాపై నిరంతర నిఘాగ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలున్న గ్రామాలు, వార్డులను గుర్తించాలని ఆదేశించారు. విద్యుత్, నీటిపారుదల, భూగర్భ జల శాఖల సమన్వయంతో రాబోయే ఆగస్టు వరకు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి మండలంలో రెండు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ 60 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశిం చారు. జీవో 59 కింద దాఖలైన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, డీపీఓ కిషన్, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏడు సన్న ధాన్యం రకాలకు బోనస్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 15: వానాకాలం 2026–27 ధాన్యం కొనుగోలు సీజన్ ఈనెల నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒకరిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూస్తున్నామని వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవచ్చన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా రైతులకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలి



ముద్ర, తుర్కపల్లి: వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు తగిన గుర్తింపు, హక్కులు కల్పించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమగ్రంగా, సమానంగా, సుస్థిరంగా అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్‌కు చెందిన భూమిక వ్యవస్థాపకురాలు సత్యవతి అన్నారు.గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో పిలుపు సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మహిళా రైతుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కల్పించాల్సిన హక్కులు, వ్యవసాయ రంగంలో వారి పాత్రపై మాట్లాడారు.మహిళా కిసాన్ అధికార మంచ్ ప్రతినిధులు రుక్మిణి, ఇందిరా మాట్లాడుతూ మహిళలను కేవలం వ్యవసాయ కూలీలుగా కాకుండా పంటల సాగు, ఉత్పత్తి, వ్యవసాయ నిర్వహణలో కీలక నిర్ణయాలు తీసుకునే రైతులుగా గుర్తించాలని కోరారు. మహిళా రైతుల హక్కులను పరిరక్షించేందుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రైతులకు అవసరమైన హక్కులు, సౌకర్యాలు, గుర్తింపునకు సంబంధించిన డిమాండ్లను చట్టంలో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు లభించడం లేదని వక్తలు పేర్కొన్నారు. మహిళా రైతులకు సముచిత స్థానం కల్పించడం ద్వారా వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావడంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పది గ్రామాలకు చెందిన 120 మంది మహిళా రైతులు, పది మంది పురుష రైతులతో పాటు రైతు నేస్తం, స్వర భారతి, ఒంటరి మహిళా సమాఖ్యల బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. పిలుపు సంస్థ సిబ్బంది ఫాతిమా, కృష్ణ, సంస్థ వ్యవస్థాపకులు జనార్దన్ తదితరులు హాజరయ్యారు.

మున్సిపాలిటీల శానిటేషన్ పై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ నగేష్



ముద్ర ప్రతినిధి, మెదక్: మున్సిపాలిటీలలో శానిటేషన్ పై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నగేష్ కమిషనర్లను ఆదేశించారు. తడి చెత్త – పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా అవగాహన కల్పించాలని, ప్రజా జీవనంలో ప్రజలతో భాగస్వామ్యం కావాలని సూచించారు. కలెక్టరేట్ లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల మున్సిపల్ మున్సిపల్ కమిషనర్స్, సిబ్బందితో సమగ్రాభివృద్ధిపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధి, శానిటషన్ కోసం సమగ్ర కార్య చరణతో ముందుకు నడవాలన్నారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసి, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను 4 రకాలుగా వేరు చేయాలని,,త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, వీధి దీపాలు క్రమం తప్పకుండా వెలగాలని, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, రామాయంపేట తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

3వ రోజుకు చేరిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి సంఘీభావం



ముద్ర ప్రతినిధి, మెదక్: జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం 3వ రోజుకు చేరుకుంది. సమ్మెకు మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి,, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జెడ్పి మాజీ చైర్ పర్సన్ తుల ఉమ, ఇతర పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ సమ్మెలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డా.వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. హృదయ్, వైస్ ప్రెసిడెంట్ డా.ప్రియాంక, కల్చరల్ సెక్రటరీ సౌమ్య, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, మాయ గంగామణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, గంగా నరేందర్, శంకరంపేట మాజీ జెడ్పీటీసీ మాధవి రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555